చితికిన చిన్న షేర్లు 3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 222 | విజయవాడ, ఆదివారం 17 మార్చి 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 17 March 2024 | Rs

అమరజీవి త్యాగనిరతి వెలకట్టలేనిది

ప్రజాశక్తి -నెల్లూరు

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి వెలకట్టలేనిదని నెల్లూరు కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఎల్లప్పుడూ పదిలమని పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం శ్రీరాములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఆయన ప్రాణ త్యాగం ఫలితమేనని చెప్పారు.

మోగిన ఎన్నికల నగారా

• ఏడు విడతల్లో పోలింగ్ • ఏప్రిల్ 19న తొలి విడత, జూన్1న చివరి విడత

మీడియాతో మాట్లాడుతున్న సిఇసి రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలతోబాటు ఆంధ్రప్రదేశ్ (175), ఒడిశా (147), అరుణాచల్ ప్రదేశ్ (60), సిక్కిం (32) అసెంబ్లీలకు కూడా ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) శనివారం ప్రకటించింది. జమ్ముకాశ్మీర్ అసెంబ్లీకి మాత్రం ఎన్నికలు లేవని చెప్పింది. దాదాపు దశాబ్ద కాలంగా జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం లేదు. అక్కడ చివరిసారిగా 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలషెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినట్లు పరిగణించాలని ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ చెప్పారు. కొత్తగా నియమితులైన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులతోకలసి శనివారం మధ్యాహ్నం ఆయన ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. వారు విడుదలజేసిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మొత్తం ఏడు విడతల్లో జరుగుతుంది. ఏప్రిల్19న మొదటి విడతతో మొదలై, జూన్1న చివరి విడతతో పోలింగ్ ఘట్టం ముగుస్తుంది. జూన్4న ఓట్ల లెక్కింపు చేపడతారు. లోక్‌సభ స్థానాలతోబాటే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లోని 175 స్థానాలకు మే 13న ఒకే విడత కింద ఎన్నికలు జరుగుతాయి. అలాగే కేరళలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26న ఒకే విడతన పోలింగ్ జరుగుతుంది. త్రిపురలోని రెండు లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19, 26 తేదీలలో రెండు విడతలుగా పోలింగ్ నిర్వహించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం ఏడు విడతలుగా పోలింగ్ జరగనుంది. ఒడిశా అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకునాలుగు దశల్లో ను, తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు మే4న ఒకే విడతలోను ఎన్నికలు జరగనున్నాయి

ఈ సందర్భంగా ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల విధుల్లో వాలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొనబోరని చెప్పారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో పోలింగ్ స్టేషన్‌కు రాలేని స్థితిలో ఉన్నవారు ఇంటి నుంచి ఓటు వేయవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చిన్నారులను ఉపయోగించొద్దని సూచించారు. అరుణాచల్, గోవా, సిక్కిం మినహా అన్ని రాష్ట్రాలు, ఢిల్లీ, జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాల్లో పార్లమెంటరీ స్థానాల అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షలు ఖర్చు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మూడు రాష్ట్రాలు, మిగతా కేంద్రపాలిత ప్రాంతాల అభ్యర్థులకు మాత్రం రూ.75 లక్షల పరిమితి విధించినట్లు పేర్కొన్నారు. ఇక, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు రూ. 40 లక్షలు, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అభ్యర్థులు రూ.28 లక్షలు ఖర్చు చేసుకోవచ్చని తెలిపారు.

ఎలాంటి విద్వేష ప్రసంగాలు చేయకూడదని, కులం, మతం ఆధారంగా ఓట్లు అడగొద్దని రాజకీయ పార్టీలకు సూచించారు. వ్యక్తిగత జీవితం లక్ష్యంగా విమర్శలు చేయరాదని, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రత్యర్థులను అవమానపరిచేలా సోషల్ మీడియా పోస్టులు పెట్టకూడదని సూచించారు. ప్రచార సమయంలో రాజకీయ పార్టీలు వికలాంగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. నకిలీ సమాచారంతో జాగ్రత్తగా ఉండాలని రాజీవ్ కుమార్ హెచ్చరించారు. పార్టీలు మిగతా 5లో



రాష్ట్రంలో మే13న

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఏప్రిల్ 25
- నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు ఏప్రిల్ 29
- షెడ్యూల్ ప్రకటించిన సిఇఓ ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో మే నెల 13వ తేదిన పోలింగ్ జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంటు, 175 అసెంబ్లీ స్థానాల్లో ఒకే విడతలో ఆ రోజు పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శనివారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు ఏప్రిల్ 18వ తేదిన నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఆ రోజు నుండే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాల్లో నాలు ఎస్సీలకు, ఒకటి ఎస్‌టిలకు, అసెంబ్లీ స్థానాల్లో ఎస్‌సిలకు, ఏడు ఎస్‌టిలకు రిజర్వు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 4.90 కోట్ల మంది ఓటర్లున్నారని, వీరందరు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,165 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, ఎన్నికల విధుల కోసం 3.82 లక్షల మంది ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగుల సేవలను వినియోగించుకోనున్నట్లు చెప్పారు. అదే విధంగా లక్షకుపైబడి పోలీస్, పారామిలటరీ, కేంద్ర బలగాల సేవలను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్‌విడుదలైన (శనివారం) రోజునుండి ఓటర్ల జాబితాలో తొలగింపు, మార్పులు, చేర్పులకు అవకాశం లేదని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదుకు మాత్రం ఏప్రిల్ 25వ తేదీ అంటే నామినేషన్ల దాఖలకు చివరి తేదీ వరకు అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు మిగతా 5లో

రాష్ట్రంలో ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు	4,09,37,352
పురుష ఓటర్లు	2,00,84,276
మహిళా ఓటరు	2,08,49,730
థర్డ్ జెండర్ ఓటర్లు	3,346
ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు	7,763
మొత్తం పోలింగ్ స్టేషన్లు	46,165

సామాజిక న్యాయానికి పెద్ద పీట

వైసిపి జాబితా ప్రకటనలో సిఎం జగన్

- మహిళా ప్రాతినిధ్యం మరింత పెంచుతాం
- అభ్యర్థుల పేర్లు ప్రకటించిన ధర్మాన, నందిగం సురేష్

అభ్యర్థుల ప్రకటనలో ముఖ్యమంత్రి జగన్,మంత్రి ధర్మాన ప్రసాదరావు, బాపట్ల ఎంపి నందిగం సురేష్ తదితరులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/వేంపల్లె

వైసిపి అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పారు. శనివారం ఇడుపుల పాయలో రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు, బాపట్ల ఎంపి నందిగం సురేష్‌తు వైసిపి అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. అంతకుముందు జగనమోహన్‌రెడ్డితో పాటు వైసిపి నేతలు వైఎస్‌ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం . ధర్మాన ప్రసాదరావు, సురేష్ మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో వైఎస్‌ఆర్ ఘాట్‌లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమను పక్కన కూర్చో బెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థిత్వాలను తమతోనే ప్రకటింపజేశారని గుర్తు చేశారు. ఈసారీ తామే ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల బరిలోకి దిగే అభ్యర్థుల పేర్లను వారు ప్రకటించారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించామని అన్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో ఎస్‌సిలకు 33, ఎస్‌టిలకు 8, బిసిలకు 59 కేటాయించామని చెప్పారు. మొత్తం సీట్లతో వీరికి 50 శాతం ఇచ్చామని తెలిపారు. గతం కంటే 11 సీట్లు అదనంగా కేటాయించామని చెప్పారు. ఒక అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థిని మాత్రం పెండింగ్‌లో ఉంచినట్లు చెప్పారు. మహిళలకు సముచిత స్థానం కల్పించామన్నారు. అయినా తనకు సంతృప్తి కలగడం లేదని, భవిష్యత్తులో వారి ప్రాతినిధ్యాన్ని మరింత పెంచడానికి కృషి చేస్తామన్నారు. ఈ స్థాయిలో మార్పులు చేయగలిగిన ధైర్యం మరెవరికీ ఉండకపోవచ్చన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు కలిపి 22 స్థానాలను మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. ఇది 12శాతమని తెలిపారు. అభ్యర్థులలో 77 శాతం మంది గ్రాడ్యుయేట్లు, ఆ పైన చదివినవారని తెలిపారు. మైనార్టీలకు గతంలో ఐదు స్థానాలిస్తే ప్రస్తుతం ఏడు స్థానాలకు పెంచినట్లు తెలిపారు. టికెట్లు రాని వారికి భవిష్యత్తులో ఏదో రూపంలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల కాలంలో కనీవిని ఎరుగని విధంగా విప్లవాత్మక పాలన అందించినట్లు తెలిపారు. 2.70 లక్షల కోట్ల రూపాయలను బటన్ నొక్కడం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసినట్లు తెలిపారు. 2-3 నెలలో రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆయన అన్నారు. మళ్లీ ప్రమాణ స్వీకారం చేస్తామని,సామాజిక న్యాయాన్ని ఇంకా ముందుకు తీసుకుపోదామని చెప్పారు.

అభ్యర్థుల జాబితా 2లో..

స్వాతంత్ర్యం వచ్చినట్టుంది!

- వైసిపికి కౌంట్‌డౌన్ మొదలైంది
- కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలే
- టిడిపి లీగల్ సెల్ సదస్సులో చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో స్వాతంత్రం వచ్చినట్టుందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కోడ్ అమలులోకి రావడంతో వైసిపి పాలనకు కూడా కౌంట్‌డౌన్ ప్రారంభం అయిందని చెప్పారు. ఇక ఎవరికి భయం లేదని, అందరూ బయటకు రావచ్చని చెప్పారు. ఫించనులు కట్ అవుతాయని, కేసులు పెడతారన్న భయం ఇక అవసరం లేదని అన్నారు. ప్రజలు గెలవాలి...రాష్ట్రం నిలవాలన్నది తన నినాదమని చెప్పారు. ఎన్నికల తరువాత కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డిఎ ప్రభుత్వాలు రానున్నాయని చెప్పారు. కేంద్రంలో 400 సీట్లతో రాష్ట్రంలో ఎప్పుడూ లేని మెజార్టీతో గెలవబోతున్నట్లు తెలిపారు. జగన్‌కు దిమ్మతిరిగే ఫలితం ఎన్నికల్లో రాబోతోందన్నారు. 57 రోజుల తరువాత చరిత్ర తిరగరాయబోతున్నామని చెప్పారు. ఇప్పటిదాకా అన్ని ఎన్నికల్లో తన నామినేషన్‌ను కార్యకర్తలు, న్యాయవాదులే వేసేవారని, తాను కేవలం డిక్లరేషన్ పత్రంపైనే సంతకం చేసేవాడినని చెప్పారు. ప్రస్తుతం సాంకేతిక కారణాలతో నామినేషన్ల విషయంలో ఇబ్బందులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. తనపైన ఎన్ని దొంగ కేసులు పెట్టారో తెలియదని, అందుకు తనపై ఉన్న కేసుల వివరాలు తెలపాలని డిజిపిని కోరానని చెప్పారు. టిడిపి నుండి పోటీ చేస్తున్న మిగిలిన అభ్యర్థుల పరిస్థితి కూడా ఇదే అన్నారు. లాయర్లకు వైసిపి ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 3,500 మంది జూనియర్ లాయర్లకు రూ.7వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దుచేస్తామని చెప్పారు.

ఇడి కేసుల్లో కేజ్రీవాల్‌కు బెయిల్

న్యూఢిల్లీ : ఇడి కేసుల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిలు లభించింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో విచారించేందుకు ఎనిమిదిసార్లు సమన్లు జారీ చేసినా హాజరు కావడం లేదంటూ కేజ్రీవాల్‌పై ఇడి ఫిర్యాదు చేయడం, న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో శనివారం ఆయన ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు హాజరయ్యారు. ఆయనపై పెట్టిన కేసులు బెయిల్ పొందడానికి అవకాశం ఉన్న సెక్షన్లని న్యాయమూర్తి తెలిపారు. రూ.15వేల పూచీకత్తు, లక్ష రూపాయల ష్యూరిటీపై ఇడి చేసిన రెండు ఫిర్యాదుల్లోనూ కేజ్రీవాల్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తును సమర్పించి కోర్టు అనుమతితో కేజ్రీవాల్ వెళ్లిపోయారు. సిఆర్‌పిసి సెక్షన్ 207 కింద పత్రాలను తనకు అందజేయాలంటూ కేజ్రీవాల్ పెట్టుకున్న దరఖాస్తును ఏప్రిల్ 1న కోర్టు విచారించనుంది.

ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చింది?

- ఎన్నికల బాండ్ల వివరాలు ఎస్‌బిఐ వెల్లడించాలి
- 16 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంట్ స్థానాల్లో సిపిఎం పోటీ : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఎన్నికల బాండ్లు ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో ఎస్‌బిఐ బయటపెట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన సిపిఎం గుంటూరు జిల్లా విస్తృత సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఎస్‌బిఐ... ఎన్నికల బాండ్లు ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో చెప్పిందేగానీ, ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో వెల్లడించలేదన్నారు. ఎన్నికల బాండ్లు పెద్ద అవినీతి కుంభకోణమని తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. అందులో పెద్ద దొంగ బిజెపి అని వివరించారు. వైసిపికి రూ.337 కోట్లు, టిడిపికి రూ.218 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చినట్లుగా చెప్పారని, ఏయే కంపెనీల నుంచి ఎంత వచ్చిందో వివరాలను ఆ రెండు పార్టీలూ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇండియా వేదిక భాగస్వాములతో కమ్యూనిస్టు పార్టీలు అవగాహనతో పోటీ చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే సిపిఎం, సిపిఐకి మధ్య అవగాహన ఉందని, ఇండియా వేదికలోని కాంగ్రెస్ పార్టీతో చర్చలు జరుపుతున్నామని, రెండు, మూడు రోజుల్లో ఒక కొలిక్కి వస్తాయని తెలిపారు. మంగళగిరిలో సిపిఎం పోటీ చేస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయాలని అనుకున్నట్లు తెలిపారు. ఇండియా వేదికలోని పార్టీలతో చర్చల తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. డబ్బులతో ఓట్లను కొనకుండా ఎన్నికల్లో పోటీ చేసే సత్తా టిడిపికి, వైసిపికి ఉందా? అని ప్రశ్నించారు. ప్రజల వద్ద విరాళాలు వసూలు చేసి ఎన్నికల్లోకి వెళ్తున్న పార్టీ సిపిఎం మాత్రమేనని తెలిపారు. సిఎఎను సమర్థిస్తూ చంద్రబాబు మాట్లాడడం దారుణమన్నారు. ముస్లిములకు మాత్రమే పౌరసత్వం ఇవ్వబోమనే మిగతా 2లో

ఎపి భవన్ విభజన

- ఎపికి 11 ఎకరాలు
- తెలంగాణకి 8 ఎకరాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన పీటముడి ఎట్టకేలకు వీడింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య భవన్ ఆస్తులను విభజిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు 11.536 ఎకరాలు కేటాయించగా, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించింది. ఎపికి కేటాయించిన 11.536 ఎకరాల్లో 5.781 ఎకరాల్లో ఉన్న గోదావరి బ్లాక్, స్వర్ణముఖి బ్లాక్, నర్సింగ్ హాస్టల్‌లో 3.359 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 2.396 ఎకరాలు కేటాయించారు. తెలంగాణకు కేటాయించిన 8.245 ఎకరాల్లో శబరి బ్లాక్‌లో 3 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 5.245 ఎకరాలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి.

అమెరికాలో గుంటూరు విద్యార్థి హత్య 3

ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో సభకు హాజరైన వందలాది మంది ప్రజలు, కార్మికులు

సభలో మాట్లాడుతున్న రేవంత్, వేదికపై షర్మిల

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తుంటే ప్రశ్నించరేం? 2

విశాఖ ఉక్కు - న్యాయసాధన సభలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

వైసిపి అభ్యర్థులు వీరే

	అసెంబ్లీ	అభ్యర్థి	కేటగిరి
1.	శ్రీకాకుళం	ధర్మాన ప్రసాదరావు	బిసి
2.	ఆమదాలవలస	తమ్మినేని సీతారామ్	బిసి
3.	పాతపట్నం	రెడ్డి శాంతి	బిసి
4.	నరసన్నపేట	ధర్మాన కృష్ణదాస్	బిసి
5.	టెక్కలి	దువ్వాడ శ్రీనివాస్	బిసి
6.	ఇచ్ఛాపురం	పిరియ విజయ	బిసి
7.	పలాస	సీదిరి అప్పలరాజు	బిసి
8.	రాజాం	తాలే రాజేష్	ఎస్‌సి
9.	విజయనగరం	కోలగట్ల వీరభద్రస్వామి	ఒసి
10.	బొబ్బిలి	ఎస్‌విసి.అప్పలనాయుడు	బిసి
11.	గజపతినగరం	బొత్స అప్పలనరసయ్య	బిసి
12.	చీపురుపల్లి	బొత్స సత్యనారాయణ	బిసి
13.	నెలిమర్ల	బడ్డుకొండ అప్పలనాయుడు	బిసి
14.	ఎచ్చెర్ల	గొర్లె కిరణ్‌కుమార్	బిసి
15.	గాజువాక	గుడివాడ అమర్నాథ్	ఒసి
16.	విశాఖ దక్షిణ	వాసుపల్లి గణేష్ కుమార్	బిసి
17.	విశాఖ ఉత్తరం	కమ్మిల కన్నపరాజు (కె.కె.రాజు)	ఒసి
18.	భీమిలి	ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి)	ఒసి
19.	విశాఖ తూర్పు	ఎంవివి సత్యనారాయణ	ఒసి
20.	విశాఖ పశ్చిమ	ఆడారి ఆనంద్ కుమార్	బిసి
21.	శృంగవరపుకోట	కడుబండి శ్రీనివాసరావు	బిసి
22.	పెందుర్తి	అన్నంరెడ్డి అదీప్‌రాజు	బిసి
23.	పాయకరావుపేట	కంబాల జోగులు	ఎస్‌సి
24.	చోడవరం	కరణం ధర్మశ్రీ	ఒసి
25.	నర్సీపట్నం	పి.ఉమాశంకర గణేష్	బిసి
26.	అనకాపలి	మలసాల భరత్‌కుమార్	బిసి
27.	మాడుగుల	బూడి ముత్యాలనాయుడు	బిసి
28.	యలమంచిలి	యు.వెంకటరమణమూర్తిరాజు	ఒసి
29.	అరకులోయ	రేగం మత్స్యలింగం	ఎస్‌టి
30.	పాడేరు	మత్స్యరాస విశ్వేశ్వరరాజు	ఎస్‌టి
31.	రంపచోడవరం	నాగులపల్లి ధనలక్ష్మి	ఎస్‌టి
32.	పార్వతీపురం	అలజంగి జోగారావు	ఎస్‌సి
33.	కురుపాం	పాముల పుష్పశ్రీవాణి	ఎస్‌టి
34.	సాలూరు	పీడిక రాజన్నదొర	ఎస్‌టి
35.	పాలకొండ	విశ్వసరాయు కళావతి	ఎస్‌టి
36.	ప్రత్తిపాడు	వరుపాల సుబ్బారావు	ఒసి
37.	జగ్గంపేట	తోట నరసింహం	ఒసి
38.	తుని	దాడిశెట్టి రాజా	ఒసి
39.	పిఠాపురం	వంగా గీత	ఒసి
40.	కాకినాడ సిటి	ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి	ఒసి
41.	కాకినాడ రూరల్	కురసాల కన్నబాబు	ఒసి
42.	పెద్దాపురం	దావులూరి దొరబాబు	ఒసి
43.	రాజోలు	గొల్లపల్లి సూర్యారావు	ఎస్‌సి
44.	కొత్తపేట	చిర్ల జగ్గిరెడ్డి	ఒసి
45.	ముమ్మడివరం	పొన్నాడ వెంకట సతీష్‌కుమార్	బిసి
46.	రామచంద్రాపురం	పిల్లి సూర్యప్రకాష్	ఒసి
47.	అమలాపురం	పినిపే విశ్వరూప్	ఎస్‌సి
48.	పి.గన్నవరం	విప్పర్తి వేణుగోపాల్	ఎస్‌సి
49.	మండపేట	తోట త్రిమూర్తులు	ఒసి
50.	అనపర్తి	డా.సతీష్‌సూర్యనారాయణరెడ్డి	ఒసి
51.	గోపాలపురం	తానేటి వనిత	ఎస్‌సి
52.	రాజానగరం	జక్కంపూడి రాజా	ఒసి
53.	నిడదవోలు	గెడ్డం శ్రీనివాస్‌నాయుడు	ఒసి
54.	రాజమండ్రి సిటీ	మార్గాని భరత్‌రామ్	బిసి
55.	రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ	బిసి
56.	కొవ్వూరు	తలారి వెంకటరావు	ఎస్‌సి
57.	నరసాపురం	ఎం.ప్రసాదరాజు	ఒసి
58.	భీమవరం	గ్రంధి శ్రీనివాస్	ఒసి
59.	ఆచంట	చెరుకువాడ శ్రీరంగనాథరాజు	ఒసి
60.	తణుకు	కారుమూరి వెంకటనాగేశ్వరరావు	బిసి
61.	ఉండి	పి.వి.ఎల్ నరసింహరాజు	ఒసి
62.	తాడేపల్లిగూడెం	కొట్టు సత్యనారాయణ	ఒసి
63.	పాలకొల్లు	గుడాల శ్రీహరి గోపాలరావు	బిసి
64.	చింతలపూడి	కంభం విజయరాజు	ఎస్‌సి
65.	నూజివీడు	మేకా వెంకట ప్రతాప అప్పారావు	ఒసి
66.	దెందులూరు	కొటారు అబ్బయ్యచౌదరి	ఒసి
67.	కైకలూరు	దూలం నాగేశ్వరరావు	ఒసి
68.	పోలవరం	తెల్లం రాజ్యలక్ష్మి	ఎస్‌టి
69.	ఏలూరు	ఆళ్లకాళీకృష్ణ శ్రీనివాస్(ఆళ్లనాని)	ఒసి
70.	ఉంగుటూరు	పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు)	ఒసి
71.	పామర్రు	కైలే అనిల్‌కుమార్	ఎస్‌సి
72.	అవనిగడ్డ	సింహాద్రి రమేష్‌బాబు	ఒసి
73.	మచిలీపట్నం	పేర్ని కృష్ణమూర్తి (కిట్టు	ఒసి
74.	పెడన	ఉప్పల రాము	బిసి
75.	గుడివాడ	కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)	ఒసి
76.	గన్నవరం	వల్లభనేని వంశీమోహన్	ఒసి
77.	పెనుమలూరు	జోగి రమేష్	బిసి
78.	నందిగామ	ముండితోక జగన్ మోహన్‌రావు	ఎస్‌సి
79.	తిరువూరు	నల్లగట్ల స్వామిదాస్	ఎస్‌సి
80.	విజయవాడ	తూర్పు దేవినేని అవినాష్	ఒసి
81.	విజయవాడ పశ్చిమ	షేక్ ఆసిఫ్	బిసి
82.	విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాస్‌రావు	ఒసి
83.	జగ్గయ్యపేట	సామినేని ఉదయభాను	ఒసి
84.	మైలవరం	శరణాల తిరుపతిరావు	బిసి
85.	తాడికొండ	మేకతోటి సుచరిత	ఎస్‌సి
86.	పత్తిపాడు	బాలసాని కిరణ్‌కుమార్	ఎస్‌సి
87.	తెనాలి	అన్నాబత్తుని శివకుమార్	ఒసి
88.	పొన్నూరు	అంబటి మురళి	ఒసి
89.	గుంటూరు పశ్చిమ	విడదల రజని	బిసి
90.	మంగళగిరి	మురుగుడు లావణ్య	బిసి
91.	గుంటూరు తూర్పు	షేక్ నూరి ఫాతిమా	బిసి
92.	పెదకూరపాడు	నంబూరి శంకరరావు	ఒసి
93.	వినుకొండ	బోలా బ్రహ్మనాయుడు	ఒసి
94.	సత్తెనపలి	అంబటి రాంబాబు	ఒసి
95.	గురజాల	కాసు మహేష్‌రెడ్డి	ఒసి
96.	చిలకలూరిపేట	కావటి మనోహర్‌నాయుడు	ఒసి
97.	నరసరావుపేట	గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి	ఒసి
98.	మాచర్ల	పిన్నెలి రామకృష్ణారెడ్డి	ఒసి
99.	రేపల్లి	ఈవూరు గణేష్	బిసి
100.	బాపట్ల	కోన రఘుపతి	ఒసి
101.	వేమూరు	వరికోటి అశోక్‌బాబు	ఎస్‌సి
102.	సంతనూతలపాడు	మేరుగ నాగార్జున	ఎస్‌సి
103.	అద్దంకి	పానెం చిన్నహనిమిరెడ్డి	ఒసి
104.	పర్చూరు	ఎడం బాలాజీ	ఒసి
105.	చీరాల	కరణం వెంకటేష్	ఒసి
106.	దర్శి	బాచేపల్లి శివప్రసాద్‌రెడ్డి	ఒసి
107.	యర్రగొండపాలెం	తాటిపర్తి చంద్రశేఖర్	ఎస్‌సి
108.	గిద్దలూరు	కందూరు నాగార్జునరెడ్డి	ఒసి
109.	ఒంగోలు	బాలినేని శ్రీనివాసరెడ్డి	ఒసి
110.	కొండపి	ఆదిమూలపు సురేష్	ఎస్‌సి
111.	కనిగిరి	దద్దాల నారాయణరెడ్డి యాదవ్	బిసి
112.	మార్కాపురం	అన్నా రాంబాబు	ఒసి
113.	కందుకూరు	బుర్రా మధుసూదన్‌యాదవ్	బిసి
114.	కావలి	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి	ఒసి
115.	కోవూరు	నల్లపు ప్రసన్నకుమార్‌రెడ్డి	ఒసి
116.	నెల్లూరు సిటీ	ఎండి ఖలీల్ అహ్మద్	బిసి
117.	నెల్లూరు రూరల్	ఆదాల ప్రభాకర్‌రెడ్డి	ఒసి
118.	ఉదయగిరి	మేకపాటి రాజగోపాల్‌రెడ్డి	ఒసి
119.	ఆత్మకూరు	మేకపాటి విక్రమ్‌రెడ్డి	ఒసి
120.	సర్వేపల్లి	కాకాణి గోవర్ధన్‌రెడ్డి	ఒసి
121.	గూడూరు	మెరిగ మురళీధర్	ఎస్‌సి
122.	శ్రీకాళహస్తి	బియ్యపు మధుసూదన్‌రెడ్డి	ఒసి
123.	సుళ్లూరుపేట	కలివేటి సంజీవయ్య	ఎస్‌సి
124.	వెంకటగిరి	నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి	ఒసి
125.	తిరుపతి	భూమన అభినయ్‌రెడ్డి	ఒసి
126.	సత్యవేడు	నూకతోటి రాజేష్	ఎస్‌సి
127.	కుప్పం	కృష్ణరాఘవ జయేంద్ర భరత్	బిసి
128.	పలమనేరు	నల్లప్పగారి వెంకటగౌడ	బిసి
129.	చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి	ఒసి
130.	జిడినెల్లూరు	కృపా లక్ష్మి	ఎస్‌సి
131.	నగరి	ఆర్‌కె రోజా	ఒసి
132.	పూతలపట్టు	మద్దిరేవుల సునీల్‌కుమార్	ఎస్‌సి
133.	చిత్తూరు	ఎం. చంద్రవిజయానందరెడ్డి	ఒసి
134.	మదనపల్లి	నిసార్ అహ్మద్	బిసి
135.	పుంగనూరు	పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	ఒసి
136	పీలేరు	చింతల రామచంద్రారెడ్డి	ఒసి
137.	తంబళ్లపల్లి	పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి	ఒసి
138.	రాజంపేట	ఆకేపాటి అమరనాథరెడ్డి	ఒసి
139.	కోడూరు	కొరముట్ల శ్రీనివాసులు	ఎస్‌సి
140.	రాయచోటి	గడికోట శ్రీకాంత్‌రెడ్డి	ఒసి
141.	జమ్మలమడుగు	మూలే సుధీర్‌రెడ్డి	ఒసి
142.	కడప	అంజాద్ బాషా	బిసి
143.	బద్వేల్	దాసరి సుధ	ఎస్‌సి
144.	పులివెందుల	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి	ఒసి
145.	కమలాపురం	పి. రవీంద్రనాథరెడ్డి	ఒసి
146.	మైదుకూరు	శెట్టిపల్లి రఘురామిరెడ్డి	ఒసి
147.	ప్రొద్దుటూరు	రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి	ఒసి
148.	కోడుమూరు	అదిమూలపు సతీష్	ఎస్‌సి
149.	ఆదోని	యల్లారెడ్డి సాయిప్రసాద్‌రెడ్డి	ఒసి
150.	కర్నూలు	ఎండి ఇంతియాజ్	బిసి
151.	మంత్రాలయం	యల్లారెడ్డిగారి బాలనాగిరెడ్డి	ఒసి
152.	ఎమ్మిగనూరు	బుట్టా రేణుక	బిసి
153.	పత్తికొండ	కంగటి శ్రీదేవి	ఒసి
154.	ఆలూరు	బసిని విరూపాక్షి	బిసి
155.	నందికొట్కూరు	ధారా సుధీర్	ఎస్‌సి
156.	బనగానపల్లి	కాటసాని రామిరెడ్డి	ఒసి
157.	ఆళ్లగడ్డ	గంగుల బ్రిజేంద్రరెడ్డి	ఒసి
158.	నంద్యాల	శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి	ఒసి
159.	ప్రాణ్యం	కాటసాని రాంభూపాల్‌రెడ్డి	ఒసి
160.	డోన్	బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి	ఒసి
161.	శ్రీశైలం	శిల్పా చక్రపాణిరెడ్డి	ఒసి
162.	పుట్టపర్తి	దుద్దుకొండ శ్రీధర్‌రెడ్డి	ఒసి
163.	హిందూపురం	టిఎన్.దీపిక	బిసి
164.	ధర్మవరం	కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి	ఒసి
165.	పెనుగొండ	ఉష శ్రీచరణ్	బిసి
166.	మడకశిర	ఈర లక్కప్ప	ఎస్‌సి
167.	రాప్తాడు	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	ఒసి
168.	కదిరి	మగ్బూల్ అహ్మద్	బిసి
169.	శింగనమల	మణిపాకుల వీరాంజనేయులు	ఎస్‌సి
170.	తాడిపత్రి	కేతిరెడ్డి పెద్దారెడ్డి	ఒసి
171.	అనంతపురం	అర్బన్ అనంత వెంకటరామిరెడ్డి	ఒసి
172.	గుంతకల్లు	వై. వెంకటరామిరెడ్డి	ఒసి
173.	ఉరవకొండ	వై. విశ్వేశ్వరరెడ్డి	ఒసి
174.	కల్యాణదుర్గం	తలారి రంగయ్య	బిసి
175.	రాయదుర్గం	మెట్టు గోవిందరెడ్డి	ఒసి

పార్లమెంటు అభ్యర్థులు

1.	శ్రీకాకుళం	పేరాడ తిలక్	బిసి
2.	విజయనగరం	బెల్లాన చంద్రశేఖర్	బిసి
3.	విశాఖపట్నం	బొత్స ఝాన్సీలక్ష్మి	బిసి
4.	అనకాపల్లి	----------	
5.	అరకు	చిట్టి తనూజారాణి	ఎస్‌టి
6.	కాకినాడ	చెలమలశెట్టి సునీల్	ఒసి
7.	అమలాపురం	రాపాక వరప్రసాదరావు	ఎస్‌సి
8.	రాజమండ్రి	గూడూరి శ్రీనివాసులు	బిసి
9.	నరసాపురం	గూడూరి ఉమాబాల	బిసి
10.	ఏలూరు	కారుమూరి సునీల్ కుమార్ యాదవ్	బిసి
11.	మచిలిపట్నం	సింహాద్రి చంద్రశేఖరరావు	ఒసి
12.	విజయవాడ	కేశినేని శ్రీనివాస్	ఒసి
13.	గుంటూరు	కిలారి వెంకటరోశయ్య	ఒసి
14.	నరసరావుపేట	అనిల్‌కుమార్‌యాదవ్	బిసి
15.	బాపట్ల	నందిగం సురేష్‌బాబు	ఎస్‌సి
16.	ఒంగోలు	చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి	ఒసి
17.	నెల్లూరు	వేణుంబాక విజయసాయిరెడ్డి	ఒసి
18.	తిరుపతి	మద్దిల గురుమూర్తి	ఎస్‌సి
19.	చిత్తూరు	ఎన్.రెడ్డప్ప	ఎస్‌సి
20.	రాజంపేట	పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి	ఒసి
21.	కడప	వైఎస్ అవినాష్‌రెడ్డి	ఒసి
22.	కర్నూలు	బివై రామయ్య	బిసి
23.	నంద్యాల	పోచా బ్రహ్మానందరెడ్డి	ఒసి
24.	హిందూపురం	జొలదరాశి శాంత	బిసి
25.	అనంతపురం	మాలగుండల శంకరనారాయణ	బిసి

ఇస్లామోఫోబియాపై పాక్ తీర్మానం

- ఓటింగ్‌కు భారత్ దూరం

ఐక్యరాజ్య సమితి : ఇస్లామోఫోబియాపై పాకిస్తాన్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. హిందూవాదం, బౌద్ధవాదం, సిక్కు, ఇతర మత విశ్వాసాలకు వ్యతిరేకంగా విద్వేషాలను రెచ్చగొడుతున్నారంటూ భారత్ విమర్శించింది. కేవలం ఒక మతాన్ని మాత్రమే వేరు చేయడం కన్నా ఇతర మతాలు కూడా హింస, వివక్షను ఎదుర్కొంటున్నాయని గుర్తించాలని పేర్కొంది.

ఇస్లామోఫోబియాను ఎదుర్కొనేందుకు చర్యలు అన్న పేరుతో పాకిస్తాన్ శుక్రవారం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అనుకూలంగా 115 దేశాలు ఓటు వేయగా, 44 దేశాలు గైర్హాజరయ్యాయి. వీటిలో భారత్, బ్రెజిల్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, ఉక్రెయిన్, బ్రిటన్ వున్నాయి. యూదు వ్యతిరేకత, క్రైస్తవ విద్వేషం, ఇస్లామ్ పట్ల వ్యతిరేకతతో చేపట్టే చర్యలన్నింటినీ భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఫోబియాలు ఇతర మతాలకు కూడా వున్నాయని గుర్తించడం ముఖ్యమని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ముస్లిమేతర మతాలు కూడా మత విద్వేషాలను ఎదుర్కొంటున్నాయనడానికి స్పష్టమైన సాక్ష్యాధారాలున్నాయన్నారు. కాలక్రమంలో మతపరమైన ఫోబియాకు సమకాలీన రూపాలు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా హిందూ, బౌద్ధ, సిక్కు వ్యతిరేక భావాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా తలెత్తుతున్న మతపరమైన వివక్ష విస్తృత రూపాన్ని కూడా సభ్య దేశాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చింది?

మొదటిపేజీ తరువాయి

సిపిఎను ఆయన ఏ విధంగా సమర్థిస్తున్నారని శ్రీనివాసరావు ప్రశ్నించారు. లౌకిక పార్టీ అని చెప్పుకునే టిడిపి ఈ విధంగా మాట్లాడడం దారుణమన్నారు. బిజెపికి లొంగిపోయి టిడిపి పొత్తు పెట్టుకుందని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపికి వంత పాడుతున్న టిడిపిలను, వైసిపిని ఓడించాలని కోరారు. ఇండియా వేదికగా పోటీ చేసే పార్టీలను గెలిపించాలని పిలుపునిచ్చారు. మహిళలను అగౌరవపరుస్తూ ట్రోలింగ్ చేసే పార్టీలను బహిష్కరించాలని, ఈ సందర్భంగా గీతాంజలి ఆత్మహత్యను ఆయన ప్రస్తావించారు. ఎవరే పార్టీలో ఉన్నా మహిళలను గౌరవించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు జొన్న శివశంకరరావు, జెవి రాఘవులు, ఎం రవి, ఎస్ఎస్ చంగయ్య పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తుంటే ప్రశ్నించరేం?

- ఎపికి పాలకులు కాదు... ప్రశ్నించే గొంతుకలు కావాలి
- బిజెపి అంటే బాబు, జగన్, పవన్
- కమ్యూనిస్టు పార్టీలతో కలిసి రాష్ట్రంలో పోటీ
- విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు న్యాయసాధన సభలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

సభలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు, కె నారాయణ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రధాని నరేంద్ర మోడీ విక్రయిస్తుంటే ఎపిలో పహిల్వాన్లుగా చెప్పుకుంటున్న నాయకులు ప్రశ్నించడం లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మనం కలిసి పోరాడితే ఢిల్లీ సుల్తానులు, జాగీరార్దులు, పాలకులు ఎవరైనా తలవంచాల్సిందేనన్నారు. గతంలో ఎపి నాయకులు కేంద్రం అరాచకాలను గొంతెత్తి ప్రశ్నించబట్టే ఢిల్లీ పెత్తనం సాగలేదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నేడు కావాల్సింది ప్రశ్నించే గొంతుకలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్టీల్‌ప్లాంట్ తృష్ణ గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ నాయకులు రాకేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు న్యాయసాధన' సభకు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆ ఇద్దరు (చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి) పాలించే నాయకులు కావాలనుకుంటున్నారే తప్ప, ప్రశ్నించే గొంతుకలు కావాలనుకోవడం లేదని విమర్శించారు. ఢిల్లీ ఆధిపత్యం కిందకు ఆంధ్ర రాష్ట్రం ఇప్పటికే వెళ్లిపోయిందన్నారు. ప్రశ్నించేతత్వం లేనందునే పదేళ్లయినా పోలవరం పూర్తి కాలేదని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడానికి పూనుకోవడం లేదని, రాజధాని ఎక్కడో చెప్పలేని పరిస్థితి నెలకొందని దుయ్యబట్టారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని, ఈ రాష్ట్రంలో మోడీకి బలం వారేనని పేర్కొన్నారు. వారిలో ఎవరికి ఓటు వేసినా అంతిమంగా ఆ ఓటు వెళ్లేది బిజెపికేనని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. మణిపూర్‌లో హింస చోటు చేసుకొని బాధితులపైనే దాడులు జరుగుతుంటే వైసిపి నాయకులు ఎందుకు ప్రశ్నించలేదని రేవంత్ ప్రశ్నించారు. మతోన్మాదశక్తులతో ఏనాడూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అంటకాగలేదన్నారు. షర్మిలకు ఆంధ్ర ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎపిలో సిపిఎం, సిపిఐలతో కలిసి ఎన్నికల్లో కాంగ్రెస్ ముందుకెళ్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కాంగ్రెస్‌కు ఐదుగురు ఎంపీలను, శాసనసభకు 25 మంది ఎమ్మెల్యేలను ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కేవలం ఉక్కు పరిశ్రమ మాత్రమే కాదని, తెలుగు ప్రజల ఊపిరి అని ఉద్ఘాటించారు. అలాంటి పరిశ్రమను కేంద్రం తన కుట్రలకు బలిచేస్తుంటే రాష్ట్ర పాలకులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సి హెచ్.నరసింగరావు మాట్లాడుతూ దేశ ప్రగతికి ప్రభుత్వ రంగ సంస్థలే మూల స్తంభాలని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆనాడే చెప్పారన్నారు. 250 సంస్థలను స్థాపించి దళిత, గిరిజన, బిసి బిడ్డలకు వాటిలో ఉద్యోగాలకు ఆస్కారమిచ్చారని గుర్తు చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాటం చారిత్రాత్మకమైనదన్నారు.

గడిచిన పదేళ్లలో బిజెపికి పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి మద్దతు ఇచ్చి రాష్ట్రానికి ద్రోహం చేశాయని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ మాట్లాడుతూ ప్రధాని స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి అమ్మితే గంజాయికి స్టాక్ యార్డు అవుతుందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మితే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. సభలో కాంగ్రెస్ సీనియర్ నేతలు జెడి.శీలం, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. గతేడాది డిసెంబర్ 8న కమిషన్ 81 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకు ఆదివారం ప్రిలిమ్స్ పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు ఏర్పాట్లపై జవహర్ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 1,48,881 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని, 301 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఐఎఎస్ అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

లోక్ అదాలత్‌లో 146 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 146 కేసులు పరిష్కరమయ్యాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదేశాల మేరకు హైకోర్టులో శనివారం రెండు బెంచీలు ఏర్పాటు చేసి అదాలత్ నిర్వహించారు. ఇందుకుగాను కక్షిదారులకు రూ.9,48,66,859 పరిహారం అందింది. మొదటి బెంచ్ జస్టిస్ కిరణ్మయి మాండవ ఆధ్వర్యంలో నిర్వహించగా, రెండో బెంచ్ న్యాయవాది వల్లభనేని శాంతిశ్రీ ఆధ్వర్యంలో జరిగింది.

న్యాయవాది టిఎస్ రాయులు బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, సిబ్బందికి హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు 23 వరకు రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఇడి కస్టడీకి అనుమతిస్తూ రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో అదుపులోకి తీసుకున్న ఇడి అధికారులు శనివారం ఉదయం సిబిఐ ప్రత్యేక కోర్టులో హాజరు పర్చారు. సుదీర్ఘ వాదనల తర్వాత మార్చి 23 వరకు కవితను ఇడి కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. 23న తిరిగి కోర్టులో హాజరు పర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రతి రోజు కుటుంబ సభ్యులు, న్యాయవాదులను కలిసేందుకు, ఇంటి నుంచి తెచ్చిన ఆహారం తీసుకునేందుకు ప్రత్యేక కోర్టు అనుమతించింది. ఆమె తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించగా..ఇడి తరపున ఎన్.కె మట్టా, జోయబ్ హుసేన్ వాదించారు.

అన్నీ అవినీతి మరకలే...!

- అపరిమిత విరాళాలకు గేట్లు తెరిచిన మోడీ ప్రభుత్వం
- వాటి కోసమే పుట్టుకొచ్చిన కంపెనీలు

న్యూఢిల్లీ : తన ప్రభుత్వానికి అవినీతి ఆరోపణల మరక అంటలేదని ప్రధాని నరేంద్ర మోడీ తరచుగా చెబుతుంటారు. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించిన తర్వాత ఆయన వాదనలో ఏ మాత్రం నిజం లేదని, ప్రధాని మాటలన్నీ అబద్ధాల మూటలేనని తేలిపోయింది. సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఎన్నికల బాండ్ల గుట్టు రట్టయింది. వాటి ద్వారా అత్యధికంగా ఆర్థిక ప్రయోజనం పొందింది బిజెపియేనని స్పష్టమవడంతో తనది అవినీతి రహిత ప్రభుత్వమని మోడీ చెప్పుకోవడం హాస్యాస్పదమే అవుతుంది.

2017లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రారంభించడానికి ముందు దానిని గురించి పాలకులు ఎన్నో గొప్పలు చెప్పారు. బడా కార్పొరేట్ సంస్థలు కూడా ఈ పథకాన్ని స్వాగతిస్తున్నాయని అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే కార్పొరేట్ సంస్థల గుర్తింపును గోప్యంగా ఉంచాలని అవి కోరుతున్నాయని తెలిపారు. అయితే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో ఎక్కువగా ఊరూ పేరూ లేని సంస్థలే ఉన్నాయి. వీటిలో అనేక సంస్థలు బడా కంపెనీలకు బినామీలుగా వ్యవహరిస్తున్నవే. ఇవి తమ నికర లాభాలలో పది నుండి వంద రెట్ల వరకూ వెచ్చించి ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. ఏ కంపెనీ అయినా తన నికర లాభం కంటే వంద రెట్లు ఎక్కువ విలువ కలిగిన బాండ్లను కొనుగోలు చేయగలదా అన్నదే ఇక్కడ ప్రశ్న.

విరాళాలు పొందడానికి ఇడి, ఐటి సంస్థలను అధికార పక్షం దుర్వినియోగం చేసిందన్నది సుస్పష్టం. తన హయాంలో కంపెనీలు, వ్యక్తులకు చెందిన రూ.1.12 లక్షల కోట్ల ఆస్తులను జప్తు చేసినట్లు ప్రధాని మోడీ చెబుతారు. అయితే గత పదేళ్లలో ఇడి పెట్టిన మనీ లాండరింగ్ నిరోధక చట్టం కేసులలో కేవలం 0.5% కేసులలో మాత్రమే శిక్షలు పడ్డాయి.

విరాళాల కోసమే వెలిసిన కంపెనీలు

కంపెనీలు తమ నికర లాభాలతో నిమిత్తం లేకుండా పెద్ద మొత్తంలో పార్టీలకు విరాళాలు అందించడం వెనుక ఆ సంస్థలకు ఉన్న ప్రయోజనాలు ఏమిటి? వాటి ఉద్దేశం ఏమిటి? వీటిలో కొన్ని కంపెనీలు దొడ్డిదారిన రాజకీయ పార్టీలకు విరాళాలు అందించడానికే వెలిశాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇది క్విడ్ ప్రోకో తప్పించి మరొకటి కాదు. ఎన్నికల బాండ్ల కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు ఇదే సందేహం కలిగింది.

పసలేని నిర్మలమ్మ వాదనలు

దేశంలో మెగా ప్రాజెక్టులు చేపట్టిన మౌలిక సదుపాయాల కంపెనీల విరాళాల గుట్టును బయటపెట్టడంలో విచారణ సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రభుత్వాన్ని సమర్ధించుకుంటూ.. 'దాడుల తర్వాతే ఆయా కంపెనీలు విరాళాలు అందించాయని మీకు ఎలా తెలుసు? దాడులకు ముందే బాండ్లు కొనుగోలు చేసి ఉండవచ్చు కదా!' అని సందేహం లేవనెత్తారు. విరాళాల వ్యవహారంలో బయటపడుతున్న సమాచారాన్ని పరిశీలిస్తే ఆమె వాదనలో ఏ మాత్రం పస లేదని తేలిపోతుంది.

దాడుల తర్వాతే విరాళాలు

ఇడి, ఆదాయపన్ను అధికారులు దాడులు జరిపిన తర్వాతే పలు కంపెనీలు రూ.300 కోట్ల విలువ కలిగిన బాండ్లను కొనుగోలు చేసి, రాజకీయ పార్టీలకు సమర్పించుకున్నాయని గతంలోనే న్యూస్ మినిట్, న్యూస్‌లాండ్రీ వంటి స్వతంత్ర మీడియా సంస్థలు తమ విచారణల్లో తేల్చాయి. ఎన్నికల కమిషన్ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తే పలు కంపెనీలు ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి భారీ మొత్తంలో విరాళాలు అందించాయని స్పష్టమవుతోంది. విరాళాలు అందజేసిన కంపెనీలలో ఎన్ని సంస్థలు ఇడి, సిబిఐ, ఐటి దాడులకు గురై ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయన్నదే ప్రశ్న. అనేక చిన్న కంపెనీలు బడా కార్పొరేట్ సంస్థలకు అనుబంధ సంస్థలుగా కొనసాగుతూ బాండ్లు కొనుగోలు చేశాయి. రిలయన్స్ రిటైల్‌కు అనుబంధ కంపెనీలుగా కొనసాగుతున్న లిస్టింగ్ కాని సంస్థలే ఇందుకు ఉదాహరణ.

ప్రచారాస్త్రంగా బాండ్లు

ఎన్నికల బాండ్ల పేరుతో ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద దోపిడీ రాకెట్ నడుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష పార్టీలు ఈ బాండ్ల బాగోతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఎన్నికల బాండ్లను సిపిఎం తిరస్కరించగా, మిగిలిన ప్రతిపక్షాలకు కూడా విరాళాలు అందాయి. బిజెపికి అందిన విరాళాలలో ఇవి ఐదు నుండి ఇరవై శాతం లోపే ఉన్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే రూ.20 వేలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో ఇచ్చిన విరాళాలు మాత్రమే నమోదవుతాయి. వీటిలో 80 నుండి 85 శాతం విరాళాలు బిజెపి ఖాతాలోనే పడడంతో ప్రతిపక్షాల వాటా మరింత తగ్గిపోయింది.

పరిమితులు ఎత్తేసి...

ఎన్నికల బాండ్ల పథకం రాకముందు విరాళాలపై పరిమితి ఉండేది. కంపెనీలు గత మూడు సంవత్సరాల నికర లాభాలలో 7.5%కి మించి విరాళాలు ఇవ్వకూడదు. క్విడ్ ప్రోకోకు అడ్డుకట్ట వేయడానికే ఈ పరిమితిని విధించారు.

ఈ విరాళాలను రాజకీయ పార్టీలు, కంపెనీలు తమ పుస్తకాలలో విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల పారదర్శకతకు ఎక్కువ అవకాశం ఉండేది. ఎన్నికల బాండ్ల పథకం ఈ పరిమితిని ఎత్తేసింది. కంపెనీలు లేదా వ్యక్తులు అపరిమితంగా విరాళాలు అందించవచ్చు. ఇది అవినీతిని ఆహ్వానించడమే అవుతుంది.

పోలీస్ అధికారుల బదిలీలు రద్దు చేయాలి

- ఎన్నికల ప్రధాన అధికారికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా ఎస్పితో పాటు కొంతమంది పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని టిడిపి కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికలప్రధాన అధికారికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు శనివారం లేఖ రాశారు. ఈ నెల 14వ తేదిన ఎస్పితో పాటు అధికారులు, కానిస్టేబుళ్లను బదిలీ చేశారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో చివరి నిమిషంలో చేసిన ఈ బదీలలకు కారణం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు కానిస్టేబుళ్ల నుంచి ఎటువంటి బదిలీ వినతులు కోరకపోయినా చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ ప్రేరిపితమైన వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేసేలా ఈఆర్‌ఓలు రాజకీయ పార్టీలతో వారంతపు సమావేశాలు నిర్వహించడం లేదని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు ఎంఎ షరీఫ్ మరో లేఖ రాశారు. ఎన్నికల సంఘం ఆదేశించినా పాడేరు, రంపచోడవరం, నరసరావుపేట, సత్యవేడు, తాడిపత్రిలలో జరపడం లేదన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాకర్ల వెంకట్రామిరెడ్డి అధికార పార్టీ తరపున ఎన్నికలప్రచారం నిర్వహిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రూప్-1 అక్రమాలపై గవర్నర్‌కు ఫిర్యాదు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1 అక్రమాలపై చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు రాష్ట్రగవర్నర్‌ను కోరారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అచ్చెన్నాయుడుతో పాటు టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు, నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి గవర్నర్‌ను కలిశారు. అసలు దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసిపి జాబితాలో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం

వైసిపి ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ జి దీపక్ రెడ్డి, టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి విమర్శించారు.

టిడిపిలో చేరిన మాగుంట

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒంగోలు వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి టిడిపిలో చేరారు. టిడిపి అధినేత చంద్రబాబు పసుపు కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాసులుతో పాటు ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాచిన గరటయ్య, ఒంటేరు వేణుగోపాల్ రెడ్డి తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం టిడిపి ఇన్‌చార్జ్ ఎన్‌విఎస్‌ఎన్ వర్మ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మాగుంట రాకతో ప్రకాశం జిల్లాలో రాజకీయం తిరగబడిందన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను పిఠాపురంలో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దీనిపై వర్మ స్పందిస్తూ పవన్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

నేడు 'ప్రజాగళం' సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన-బిజెపి చిలకలూరిపేటలో నిర్వహిస్తున్న ప్రజాగళం సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మూడు మధ్య పొత్తు కుదిరిన తర్వాత ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలి సభ ఇది. దీంతో భారీ ఎత్తున జనసమీకరణ చేస్తున్నాయి. సుమారు 10 లక్షల మంది వస్తారని ఆ పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు. ఈ సభకు ప్రధాని నరేంద్ర మోడీ, టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు. అలాగే పార్టీకి పది మంది చొప్పున సీనియర్ నాయకులు వేదికపై ఉంటారు. మోడీ కోసం మూడు హెలీప్యాడ్లు, చంద్రబాబు, పవన్ కోసం మరో మూడు హెలీప్యాడ్లు సిద్ధం చేశారు. మోడీ హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో ఆదివారం చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు సభా ప్రాంగాణానికి చేరుకుంటారు. చంద్రబాబు, పవన్ 4.30 గంటలకు సభ ప్రాంగణానినికి ప్రత్యేక హెలీకాప్టర్లలో రానున్నారు.

చితికిన చిన్న షేర్లు

- మధ్యస్థ స్టాక్స్‌లోనూ అమ్మకాల వెల్లువ
- వారంలో రూ.3.90 లక్షల కోట్లు ఫట్
- సెబీ చీఫ్ వ్యాఖ్యల ఎఫెక్ట్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో చిన్న, మధ్యస్థ షేర్లు అమ్మకాల ఒత్తిడితో చితికి పోతున్నాయి. గడిచిన ఒక్క వారంలోనే స్మాల్, మిడ్ క్యాప్ స్టాక్స్ విలువ దాదాపు రూ.3.90 లక్షల కోట్లు (47 బిలియన్ డాలర్లు) హరించుకుపోయింది. గడిచిన 15 నెలల్లో ఇదే అత్యంత పేలవ ప్రదర్శన. మార్కెట్ రెగ్యూలేటర్ అయినా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్మన్ మాధుబి పురి బచ్ ఇటీవల స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ స్టాక్స్‌పై ప్రతికూల ప్రకటన చేయడంతో ఆ రంగాల సూచీలు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నాయి. గత కొన్ని నెలలుగా స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్ల విలువ వేగంగా పెరగడంపై మాధుబి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ధరల తారుమారుకు సంబంధించిన సంకేతాలను సాంకేతిక సాయంతో గుర్తిస్తున్నామని చెప్పారు. నిపుణులతో పూర్తి స్థాయిలో విశ్లేషణ చేసే పనిలో ఉన్నామన్నారు. లోపాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాధుబి చేసిన ప్రకటన ఆయా స్టాక్స్‌లో అమ్మకాల వెల్లువ చోటు చేసుకుంటుంది.

నిఫ్టీలో 52 వారాల గరిష్ట స్థాయి నుంచి స్మాల్ క్యాప్ సూచీ 10 శాతం, మిడ్ క్యాప్ సూచీ 11 శాతం చొప్పున పడిపోయాయి. కొన్ని షేర్లు 20-25 శాతం వరకు నష్టపోయాయి. 243 స్టాక్స్ ఏకంగా 20-30 శాతం విలువ కోల్పోయాయి. 275 సూచీలు 10-20 శాతం వరకు పతనమయ్యాయి. మరో 81 స్టాక్స్ అయితే ఏకంగా 52 వారాల గరిష్ట స్థాయి నుంచి ఏకంగా 30-40 శాతం క్షీణించాయి. ఇంకో 30 షేర్లు ఏకంగా 40 శాతం పైనా హరించుకుపోయాయి.

గుంటూరు జిల్లా మంగళగిరిలో చేపట్టిన నిరసనలో పాల్గొన్న వి శ్రీనివాసరావు తదితరులు

అమలాపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం, కాంగ్రెస్, విసికె పార్టీల నాయకులు

లౌకిక రాజ్యానికి తూట్లు పొడుస్తున్న మోడీ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శ
- సిఎఎను రద్దు చేయాలని డిమాండ్
- సిఎఎకు వ్యతిరేంగా రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పౌరసత్వ సవరణ (సిఎఎ) చట్టం రాజ్యాంగ వ్యతిరేకమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టే సిఎఎను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఎఎను వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎఎను తీసుకొచ్చి ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందని, లౌకిక రాజ్యానికి తూట్లు పొడుస్తుందని విమర్శించారు.

సిఎఎను సమర్థిస్తూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాట్లాడడం దారుణమని అన్నారు. బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్న వైసిపి, టిడిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడటానికి ప్రజలు పూనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ఎం సూర్యారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొన్నారు. మత ప్రాతిపదికన దేశ ప్రజలను విడగొట్టేందుకు మతోన్మాద బిజెపి తీసుకొచ్చిన సిఎఎ, ఎన్ఆర్‌సిలను తక్షణం ఉపసంహరించుకోవాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో సిపిఎం, కాంగ్రెస్, విసికె, ఆర్‌పిఐ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు డి.బి.లోక్ మాట్లాడుతూ దేశ సమైక్యతకు ప్రమాదకరమైన సిఎఎను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అమలు పరిచేందుకు బిజెపి ఆడుతున్న కుట్రలను రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేనలు వ్యతిరేకించకపోతే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. కడపలోని అల్మాస్‌పేట సర్కిల్ నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.

బిఎస్‌పికి ప్రవీణ్‌కుమార్ గుడ్‌బై

- భవిష్యత్‌లో బిఆర్ఎస్‌తో కలిసి నడుస్తా : ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆ పార్టీని వీడారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా శనివారం వెల్లడించారు. కొత్త మార్గంలో ప్రయాణించాల్సిన సమయం వచ్చిందని, పార్టీని వీడడం తప్ప మరో అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. పొత్తు (బిఆర్ఎస్-బిఎస్‌పి) ఒప్పందంలో భాగంగా ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా ముందుకు సాగాల్సిందేననీ, ఇదే తాను నమ్మిన నిజమైన ధర్మమని చెప్పారు. బిఆర్ఎస్-బిఎస్‌పి పొత్తు గురించి వార్త బయటకు వచ్చిన వెంటనే దాన్ని భగ్నం చేయాలని బిజెపి విశ్వప్రయత్నాలు (కవిత అరెస్టుతో సహా) చేస్తోందన్నారు. ఈ కుట్రలకు భయపడి తాను నమ్ముకున్న విలువలకు తిలోదకాలు ఇవ్వలేనని స్పష్టంచేశారు. తన ప్రస్తావన ఆగదనీ, చివరి వరకు బహుజన వాదాన్ని గుండెల్లో పదిలంగా దాచుకుంటా అని ట్వీట్టర్‌లో రాసుకొచ్చారు. తెలంగాణలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఇక బిఎస్‌పిదేనని అన్నారు. ట్వీట్ చేసిన కాసేపటికే హైదరాబాద్‌లో కెసిఆర్‌తో ఆయన భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్, బిఎస్‌పి పొత్తు లేకుండా బిజెపి ఒత్తిడి తీసుకొచ్చిందని, ఒప్పందాన్ని ఉల్లంఘించరాదన్నదే తన అభిమతమని తెలిపారు. 'రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు లౌకిక కూటమి ఏర్పాటు చేస్తే నాపై ఒత్తిడి తీసుకొచ్చారు. బిఆర్ఎస్‌తో పొత్తు లేదని మీడియా సమావేశం పెట్టాలని ఆదేశించారు. అందుకే బాధాతప్త హృదయంతో బిఎస్‌పిని వీడాను. తెలంగాణలో ఉండే బహుజన ప్రయోజనాల కోసమే నా నిర్ణయం. నేను ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గను. అందరితో చర్చించాకే రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటా. భవిష్యత్‌లో కెసిఆర్, బిఆర్ఎస్‌తో కలిసి నడుస్తా" అని తెలిపారు.

అమెరికాలో గుంటూరు విద్యార్థి హత్య

- స్వగ్రామం బుర్రిపాలెంలో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

అభిజిత్

అమెరికాలో గుంటూరు జిల్లా విద్యార్థి దారుణ హత్యకు గురయ్యారు. బోస్టన్‌లోని యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పరుచూరి అభిజిత్ (20)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ నెల 11న యూనివర్సిటీ క్యాంపస్‌లో హత్య చేసినట్లుగా తెలిసింది. సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా అభిజిత్ మృతదేహాన్ని పోలీసులు అడవిలో గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అభిజిత్ మృతదేహాన్ని శుక్రవారం అర్ధరాత్రి బుర్రిపాలెంకు తరలించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి నివాళులర్పించారు. శనివారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అభిజిత్ తల్లిదండ్రులు పరుచూరి చక్రధర్, శ్రీలక్ష్మి దాదాపు 18 ఏళ్ళ క్రితం ఉద్యోగం నిమిత్తం అమెరికా వెళ్ళి బోస్టన్‌లో స్థిరపడ్డారు. కుమారుడు అభిజిత్ బోస్టన్‌కు 120 కిలో మీటర్ల దూరంలోని మెశాచ్యూసేట్స్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. కొద్దిరోజులు యూనివర్సిటీకి సెలవులు ప్రకటించడంతో ఆయనను ఇంటికి తీసుకొచ్చేందుకు అభిజిత్ పిన్ని కారులో యూనివర్సిటీకి వెళ్లారు. పలుమార్లు అభిజిత్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో యూనివర్సిటీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అభిజిత్‌ను గుర్తించారు. అటవీ ప్రాంతంలో ఓ కారులో హత్యకు గురై విగతజీవిగా పడి ఉన్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు వెల్లడించారు.

మరోసారి అధికారమిస్తే అన్నీ నెరవేరుస్తాం!

- కాంగ్రెస్ ప్రభుత్వంపై విసర్లు
- నాగర్‌కర్నూల్ బిజెపి విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజలు బిజెపిని అశ్వీరదిస్తే మూడోసారి అధికారంలోకి వస్తామనీ, అప్పుడు ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీనిచ్చారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ అనే రెండు ఇసుర్రాళ్ల మధ్య తెలంగాణ నలిగిపోతున్నదనీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్లు ఉంటే సర్వనాశనమే అని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. తెలంగాణ దక్షిణ భారతదేశానికి ముఖద్వారమని చెప్పారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ పార్లమెంటరీ నియోజకవర్గాల బిజెపి అభ్యర్థులు పి.భరత్, డికె అరుణ, సైదిరెడ్డి గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన విజయసంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అన్ని సీట్లను గెలిపించి గిప్టుగా ఇస్తే పగలూ, రాత్రి ప్రజల కోసం పనిచేస్తామని హామీనిచ్చారు. దళితబంధు ఇస్తామనీ, దళితుడిని సిఎం చేస్తానని కెసిఆర్ మోసం చేశారన్నారు. యాదగిరి గుట్టలో సిఎం, ఇతర మంత్రులు పెద్ద పీట మీద కూర్చుని దళితుడైన డిప్యూటీ సిఎంను చిన్న పీటపై కూర్చోబెట్టి అవమానపరిచారన్నారు. ఆర్టికల్ 370 రద్దుచేశామనీ, రామమందిరాన్ని కట్టించామని చెప్పారు. తెలంగాణలో ప్రజల కోసం కోటి ఖాతాలను తెరిచాం, చాయ్‌కి పెట్టే ఖర్చుతో కోటిన్నర మందికి బీమా కల్పించామని తెలిపారు. అవినీతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ భాగస్వాములని అని విమర్శించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్యారెంటీలతో గారడీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఈ సభలో బిజెపి నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఆచారి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రావు, తదితరులు మాట్లాడారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

సిఎం, ప్రముఖుల టూర్లకు రూ.25 కోట్ల బకాయి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త రాజధానిగా ప్రచారంలో ఉన్న విశాఖ నగరానికి ప్రముఖులు వస్తున్నారంటేచాలు అక్కడి యంత్రాంగం హడలిపోతోంది. వచ్చేవారు సకల సౌకర్యాలు ఆస్వాదించి వెళ్లిపోతున్నారే తప్ప అందుకయ్యే ఖర్చులు మాత్రం రావడం లేదు. ఇలా వందలూ వేలూ లక్షలూ కాదు... ఏకంగా కోట్లాది రూపాయలు బకాయిలుగా పేరుకుపోతున్నట్లు అక్కడి అధికారులు వాపోతున్నారు. విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించిన తరువాత అక్కడి ముఖ్యమంత్రి, మంత్రులు, అత్యుతన్నత స్థాయి అధికారుల పర్యటనలు అధికమయ్యాయి. వారి కోసం ఖరీదైన హోటళ్లలో విలాసవంతమైన గదులు, అత్యంత ఖరీదైన ఆహారం, వాహనాలు, సభలకు షామియానాలు ఏర్పాటుచేయాల్సి వస్తోంది. దీనికోసం అక్కడి జిల్లా యంత్రాంగం నిధులను భరించాల్సి వస్తోంది. ఆ నిధులు వాస్తవంగా సాధారణ పరిపాలన శాఖలోని ప్రోటోకాల్ విభాగం సమకూర్చాల్సి ఉన్నప్పటికీ ఆ నిధులు మాత్రం విడుదల కావడం లేదని అంటున్నారు. ఇలా ప్రముఖుల పర్యటనల కోసం ఖర్చు చేసిన బకాయిలు గత ప్రభుత్వంతోపాటు ఇప్పటి ప్రభుత్వంలో కూడా పెద్ద ఎత్తునే రావాల్సి ఉందని అంటున్నారు. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై ఆ జిల్లా కలెక్టర్ తాజాగా సాధారణ పరిపాలన శాఖకు లేఖ రాసారు. మొత్తం 25.41 కోట్లు వరకు రావాల్సి ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. వీటిల్లో గత ప్రభుత్వ హయాంలో 14.74 కోట్లు, ఈ ప్రభుత్వంలో 10.66 కోట్లు బకాయిలుగా ఉన్నాయని గుర్తు చేశారు. కాగా ఈ పర్యటనల్లో అత్యధికంగా ప్రముఖల సమావేశాలకు వచ్చే వారికోసం ఏర్పాటుచే- షామియానాలకే 9.20 కోట్ల రూపాయలను ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇక వారికి కావాల్సిన వాహనాల ఏర్పాటుకు 9.08 కోట్లు, ఆ వాహనాలకయ్యే ఇంధనం కోసం 1.51 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఇక అతిథుల కోసం ఖరీదైన హోటళ్లకు 3.95 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసారట.

సుదీర్ఘ ఎన్నికల కోడ్

- 81 రోజులపాటు అమల్లో..
- ఇటు అధికారుల్లో, అటు రాజకీయ పార్టీల్లో ఒత్తిడి..

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం షెడ్యూల్ విడుదల చేయటంతోనే ఈ కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నెల16 నుంచి జూన్ 4 వరకు దాదాపు 81 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండనుంది. 2019 ఎన్నికల షెడ్యూల్డ్‌తో పోల్చితే, ఈ సంవత్సరం దాదాపు వారం రోజులు అధికంగా కోడ్ అమల్లో ఉంటుంది. 2019లో మార్చి 10న ఎన్నికల షెడ్యూల్డ్ విడుదల చేయగా, మార్చి 18న నోటిఫికేషన్ ఇచ్చారు, ఆ తర్వాత మే 23న ఫలితాలు ప్రకటించారు. ఈ సంవత్సరం మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా..ఏప్రిల్ 18న రాష్ట్రంలో నోటిఫికేషన్ జారీచేయనున్నారు. మే13న పోలింగ్ నిర్వహించి, జూన్4న ఫలితాలు ప్రకటిస్తారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో రాష్ట్రంలోని అన్ని శాఖలు, ప్రభుత్వాధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల కమిషన్ పరిధిలోకి వచ్చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఇకపై ఏ విషయంలోనూ రాజకీయ నాయకులు, ఇప్పటి వరకు ఎమ్మెల్యే, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు సిఫార్సులు, సూచనలకు అధికారులు పరిగణలోకి తీసుకోవల్సిన అవసరం ఉండదు. వివిధ సంక్షేమ కార్యక్రమాలకు కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేయకూడదు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు తదితర కార్యక్రమాలు కూడా ప్రజాప్రతినిధులు చేయకూడదు. గతంలో మొదలై ఇప్పటికీ కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మాత్రం కొనసాగించవచ్చు. వాటికి నిధుల విడుదల కూడా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం, ఆ కమిషన్ పరిధిలోనే జరుగుతుండాలి.

రాజకీయ పార్టీల్లో మరింత ఒత్తిడి

సుదీర్ఘ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి ఎన్నికల సమయం వరకు దాదాపు రెండు నెలలపాటు వివిధ అంశాలపై బరిలో నిలబడిన అభ్యర్థులు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండటంతో, వారిలో కొంత ఒత్తిడి కనిపిస్తోంది. అంతేకాక ఇంత సుదీర్ఘ గ్యాప్ ఉండటం వల్ల రాష్ట్రంలో ఏ పార్టీకి ఉపయోగం? ఏ పార్టీకి నష్టం? టికెట్ రాని అసంతృప్తుల ప్రభావం ఎంత మాత్రం ఉంటుంది? అనే అంశాలను పార్టీలు లెక్కలేసుకుంటున్నాయి. చాలా మంది అభ్యర్థులు ఎన్నికలు ఒక నెలలోపే ముగిసిపోతే బాగుండనే ఆలోచనను వ్యక్తపరుస్తున్నారు.

రానున్న కాలంలో జనసేన కనుమరుగు : ముద్రగడ

ప్రజాశక్తి - కిర్లంపూడి

రానున్న కాలంలో జనసేన పార్టీ కనుమరుగవుతుందని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. ఇటీవల ఆయన ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కిర్లంపూడిలో తన నివాసంలో శనివారం విలేకరులతో ముద్రగడ మాట్లాడారు. పార్టీ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ చేయడానికి తాను సిద్ధమని తెలిపారు. వైసిపి స్థాపనలో తానూ ఉన్నానని, కొన్ని శక్తులు జగన్‌తో కలవకుండా అప్పట్లో దూరం చేశాయన్నారు. వైసిపిలో చేరడంపై కొందరు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారని, అయితే తనను ట్రోలింగ్ చేసేవారు నిజానిజాలు తెలుసుకొని వ్యవహరించాలన్నారు. కాపు ఉద్యమం సమయంలో పవన్‌కల్యాణ్ ఎక్కడ ఉన్నాడని, ఏ మడుగులో దాక్కున్నారని ప్రశ్నించారు. 'అసలు పవన్‌కల్యాణ్ ఎందులో గొప్ప, సినిమా ఇండస్ట్రీలో గొప్పోడు అయితే అవ్వొచ్చు రాజకీయాల్లో మాత్రం నేనే గొప్ప' అని చెప్పారు. తన కుటుంబంపై చంద్రబాబు ప్రభుత్వం దాడి చేసినప్పుడు పవన్ కనీసం సానుభూతి అయినా తెలిపారా? అని ప్రశ్నించారు.

కిడ్నీ వ్యాధితో వార్డు సభ్యురాలు మృతి



ప్రజాశక్తి - ఎ.కొండూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

కిడ్నీ వ్యాధితో వార్డు సభ్యురాలు మృతి చెందిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో శనివారం చోటుచేసుకుంది. కృష్ణారావుపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని నగర తండాకు చెందిన వార్డు సభ్యురాలు భారోతు జమకి (51) పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. రెండేళ్లుగా డయాలసిస్ చేయిస్తున్నట్టు ఆమె భర్త భారోతు మంగన తెలిపారు. అప్పులు తెచ్చి వైద్యం చేయించినా ఫలితం లేదని వాపోయారు. వ్యాధి తీవ్రమవ్వడంతో జమకి మృతి చెందినట్లు తెలిపారు. ఎ.కొండూరు తహశీల్దార్ రూ.10 వేలు, గ్రామ సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి చంద్రమోహనరావు రూ.10 వేలు చొప్పున మట్టి ఖర్చులు నిమిత్తం మతురాలి భర్తకు ఆర్థిక సాయం అందజేశారు. మృతదేహాన్ని సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పానేం ఆనందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, మండల కార్యదర్శి మేకల డేవిడ్, వైసిపి నాయకులు భూకియా గనియ, ఎంపిటిసి సభ్యులు భారోతు వెంకటేష్ నాయక్, పెద్దబాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

శ్రీవారి దర్శనానికి సిఫార్సు లేఖలు రద్దు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో టిటిడి నిర్ణయం

ప్రజాశక్తి - తిరుమల

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమలలో వసతి, శ్రీవారి దర్శనానికి సిఫార్సు లేఖలను రద్దు చేస్తున్నట్లు టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు, వారి కుటుంబ సభ్యులకు నిర్దేశించిన విధివిధానాల మేరకు దర్శనం, వసతి కల్పిస్తామని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏ రకమైన వసతి, దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని, యాత్రికులు విఐపిలు సహకరించాలని కోరింది.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd
(Sponsor: CANARA BANK)
HOME LOANS ✦ DEPOSITS
Translating Dreams into Reality

బ్రాంచి ఆఫీసు, డి.నెం.40-5-9/17, ఫస్ట్ ఫ్లోర్, సిద్ధార్థ కాలేజ్ బస్ స్టాప్ దగ్గర, మొగల్రాజ్‌పురం, విజయవాడ-520010.
ఫోన్ : 0866-2474781,2481731. ఫోన్ : 7625079119
ఈ-మెయిల్ : vijaywada@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని క్రింద **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.31,86,029/- (అక్షరాలా ముప్పై ఒక్క లక్షల ఎనభై ఆరు వేల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్యవడ్డీ మరియు ఇతర అయిన ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన **ఋణగ్రహీతలు: అరవింద్ కుమార్ కోడెబోయిన, తండ్రి: లేటు కెడిఎన్ మనీంద్ర కోడెబోయిన** మరియు **ఇతర చట్టబద్ధ వారసులు** గార్లను కోరుతూ **తేది.04.01.2024న డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.16.03.2024న** దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.31,86,029/- (అక్షరాలా ముప్పై ఒక్క లక్షల ఎనభై ఆరు వేల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ పటమట సబ్ రిజిస్ట్రార్, పెనమలూరు మండలం మరియు పంచాయితీ, యనమలకుదురు గ్రామ ఆర్ఎస్ నెం.58/1లో మొత్తము 197.91 చ॥గ॥ (164.47 చ॥మీ॥)ల విస్తీర్ణం గల రెసిడెన్షియల్ భూమి నందు అవిభాజ్యపు వాటా భూమి 28.27 చ॥గ॥ (23.63 చ॥మీ॥) లతో సహా శ్రీ వినాయక రెసిడెన్సీ నందు ప్లింత్ ఏరియా 666 చ॥అ॥, కామన్ ఏరియా 86 చ॥అ॥, కార్ పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లతో ఉన్న రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-2 యావదాస్తికి **హద్దులు: స్థలం హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** డొక్కు గాంధీ ఆస్తి, **పడమర:** కతిరెడ్డి శేషారెడ్డి ఆస్తి, **ఉత్తరం:** బోలెం సుధాబిందు ఆస్తి. **ఫ్లాట్‌నకు హద్దులు: తూర్పు:** స్టెయిర్‌కేస్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

తేది : 16.03.2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

మంగళగిరి మెయిన్ బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ : 01011), గుంటూరు జిల్లా

స్వాధీనత ప్రకటన APPENDIX IV
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1) క్రింద) (స్థిరాస్తి కొరకు)

1) HTL : 38870283008, 2) TL Express : 41263542563,
3) Top UP- 41834113965.

ఇందుమూలంగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **భారతీయ స్టేట్ బ్యాంక్, మంగళగిరి మెయిన్ బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నోటీసులో పేర్కొన్న బకాయి **1) తేది. 10.01.2024 నాటికి HTL కు రూ.27,19,336/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల పంతొమ్మిది వేల మూడు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే), 2) తేది. 10.01.2024 నాటికి TL Express కు రూ.3,75,350/- (అక్షరాల మూడు లక్షల డెబ్బై ఐదు వేల మూడు వందల యాభై రూపాయలు మాత్రమే), 3) తేది. 10.01.2024 నాటికి Top Up కు రూ.1,24,788/- (అక్షరాల ఒక్క లక్షా ఇరవై నాలుగు వేల ఏడు వందల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు పైన తెలిపిన సొమ్ము మీద కాంట్రాక్టువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత(లు) : 1) శ్రీ పైర్ధా మోహన్ రావు, తండ్రి : పి. ఏలియ్య,** డి.నెం.5-177/ఎ, ఆత్మకూరు, ఆత్మకూరు రూరల్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503 **2) శ్రీమతి పైర్ధా ఆశా లత, భర్త : పైర్ధా మోహన్ రావు,** సమీప డి.నెం.5-145, ఫ్లాట్ నెం.302, 2వ అంతస్తు, చిన్ని రెసిడెన్సీ, వార్డు నెం.5, శ్రీ విజయ ఎంటర్ ప్రైజస్ దగ్గర, క్యాంప్ ఆఫీసు రోడ్, ఇప్పటం రోడ్, మైలర్ నగర్ ఏరియా, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503 వార్లను కోరుతూ **తేది.10.01.2024 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

ఋణగ్రహీత డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత ఏమి చెల్లించలేదు. మరియు ఋణగ్రహీత/హామీదారు చెల్లించవలసిన ప్రస్తుత బకాయి **1) తేది. 12.03.2024 నాటికి HTL కు రూ.27,47,937/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే), 2) తేది. 12.03.2024 నాటికి TL Express కు రూ.3,77,533/- (అక్షరాల మూడు లక్షల డెబ్బై ఏడు వేల ఐదు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే), 3) తేది. 12.03.2024 నాటికి Top Up కు రూ.1,26,864/- (అక్షరాల ఒక్క లక్షా ఇరవై ఆరు వేల ఎనిమిది వందల అరవై నాలుగు రూపాయలు మాత్రమే)** + వడ్డీతో ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి.

ఋణగ్రహీతలు/హామీదారు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతకు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్‌లో 8 & 9తో చదివే సదరు యాక్టులోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **ది.13.03.2024 న లాంఛనాత్మకంగా స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **1) తేది. 12.03.2024 నాటికి HTL కు రూ.27,47,937/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే), 2) తేది. 12.03.2024 నాటికి TL Express కు రూ.3,77,533/- (అక్షరాల మూడు లక్షల డెబ్బై ఏడు వేల ఐదు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే), 3) తేది. 12.03.2024 నాటికి Top Up కు రూ.1,26,864/- (అక్షరాల ఒక్క లక్షా ఇరవై ఆరు వేల ఎనిమిది వందల అరవై నాలుగు రూపాయలు మాత్రమే)+** వడ్డీతో ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి. సహా **భారతీయ స్టేట్ బ్యాంక్, మంగళగిరి మెయిన్ బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించగలరు

స్థిరాస్తి వివరములు

'ఎ' షెడ్యూలు : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్, మంగళగిరి మునిసిపల్ ఏరియా, మంగళగిరి డి.నెం.232/1-ఇ, 5వ వార్డు, సమీప డోర్ నెం.5-145 వద్ద 280 చ॥గ॥లు ఖాళీ ఇంటి స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు:- తూర్పు:** దామర్ల రామకాంతా రావు గారి ఇంటి స్థలం, **దక్షిణం :** పున్నా రామచంద్రయ్య గారి ఇంటి స్థలం, **పడమర:** బజార్, **ఉత్తరం :** బాపనపల్లి యేడుకొండలు గారి ఇంటి స్థలం.

పై హద్దుల మధ్య విస్తీర్ణం 280 చ॥గ॥లు లేదా 235.2 మీ॥ల స్థలంలో 35 చ॥గ॥లు లేదా 29.26 చ॥మీ॥లు స్థలం అవిభాజ్యమైన, అనిర్దేశ్యపు ఉమ్మడి వాటా కలిగి ఉన్నది.

'బి' షెడ్యూలు : పైన పేర్కొన్న 'ఎ' షెడ్యూలు ఆస్తి **"చిన్ని రెసిడెన్సీ"** నిర్మాణము, రెండవ అంతస్తు, ఫ్లాట్ నెం.302 నకు **హద్దులు:- తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** కామన్ కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

ఈ హద్దుల మధ్య 1030 చ॥అ॥లు ప్లింత్ ఏరియా, కామన్ ఏరియా మరియు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా కలిగి, అన్ని సౌకర్యాలుతో కామన్ మరియు ఉమ్మడి మరియు అన్ని ఈజుమెంటరీ హక్కులు మొ॥నవి కలిపి ఉన్నవి.

తేది : 13.03.2024
ప్రదేశం : మంగళగిరి

సం/-అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

ఎన్.ఎ.యమ్. ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్

ప్రజా ప్రకటన

తేది. 17.03.2024 నుండి ఏల్చూరు టోలు ప్లాజా కి.మీ. 168+200 వద్ద సవరించిన రుసుము వివరములు.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. జి.ఓ. నెం. 21, తేది. 20.01.2014 కి అనుగుణముగా ప్రచురితమైన రాజపత్రమును అనుసరించి మరియు ఛీఫ్ ఇంజనీరు (రహదారులు మరియు భవనముల శాఖ, యస్.హెచ్, మేనేజింగ్ డైరెక్టర్, ఎ.పి.ఆర్.డి.సి, ఆంధ్రప్రదేశ్) వారిచే ప్రచురితమైన ఉత్తర్వులు సదరు లేఖ సంఖ్య 15032024/F-88/GM/DCE-1/DEE5/AEE24/NAM (PPP)/Toll/2023-24, తేది. 14.03.2024 అనుగుణముగా దిగువ తెలుపబడిన ధరలను సవరణ చేయడమైనది. పైన ఉదహరించబడిన విధముగా ప్రభుత్వము వారి ఉత్తర్వుల మేరకు అభివృద్ధి చేసిన నాలుగు వరుసల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారిని ఉపయోగించుకొనే వాహనదారులు 69.320 కి.మీ లకు గాను **ఏల్చూరు టోలు ప్లాజా** వద్ద (కి.మీ 168+200, ఏల్చూరు గ్రామము, సంతమాగులురు మండలం, బాపట్ల జిల్లా) సవరించబడిన టోలు రుసుములు తేది. 17.03.2024 00.00 గంటల నుండి అమలు చేయబడును.

వాహన వివరములు	ఏల్చూరు టోలు ప్లాజా		
	ఒకసారి ప్రయాణం (రూ.)	రోజువారి ప్రయాణం (రూ.)	నెలసరి ప్రయాణం (రూ.)
1. కారు/జీపు/వ్యాన్	76	114	2,275
2. లైట్ కమర్షియల్ వాహనము/మినీ బస్సు	152	228	4,551
3. బస్సు/ట్రక్	303	455	9,102
4. మల్టీ యాగ్జిల్ వాహనము/ హెవీ కన్‌స్ట్రక్షన్ వాహనము	759	1,138	22,756

1). స్థానికులకు (టోలు ప్లాజా నుండి 20 కి.మీ పరిధిలో) మాత్రమే వర్తించు టోలు రుసుము వివరములు:
i) నెలసరి ప్రయాణం వాణిజ్య పరమైన వాహనములకు (కారు/జీపు/వ్యాన్) రూ. 390/-
వాణిజ్యపరము కాని వాహనములకు (కారు/జీపు/వ్యాన్) పూర్తి మినహాయింపు ఇవ్వబడును.
ii) లైట్ కమర్షియల్ వాహనములకు రోజు వారి ఒక ప్రయాణముకు రూ.40/- (నిర్దేషించబడిన పత్రాలు సమర్పించవలను).
iii) ఒక్క ట్రక్కుకు రోజు వారి ఒక ప్రయాణముకు రూ. 65/- (నిర్దేషించబడిన పత్రాలు సమర్పించవలను).
2). టోలు రుసుము నుండి వాహనములకు మినహాయింపు ప్రచురితమైన రాష్ట్ర రాజపత్రమును తేది. 20.01.2014 అనుగుణముగా వర్తింపచేయును.
3) అదనపు బరువు కల్గిన వాహనములపై విధించు అదనపు రుసుము వివరాలు :
అ) పరిమితికి మించిన బరువుతో కూడిన వాహనములు రహదారిపై నడుపుట వలన ఇట్టి రహదారికి కలుగు హానిని దృష్టిలో ఉంచుకొని, అదనపు బరువు కల్గిన వాహనదారులు మాత్రమే అదనపు రుసుమును చెల్లించవలెను. వాహనము యొక్క బరువును టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేయబడిన వేబ్రిడ్జి వద్ద నిర్ధారించిన తరువాత అట్టి అదనపు బరువుకు అదనపు రుసుము చెల్లించవలెను.
1) పరిమితికి మించిన అదనపు బరువు 10 శాతము నుంచి 20 శాతము వరకు ఉన్నచో నిర్ణీత ధరకు అదనముగా 50 శాతము రుసుము చెల్లించవలసి ఉంటుంది.
2) పరిమితికి మించిన అదనపు బరువును 20 శాతము కంటే ఎక్కువ ఉన్నచో నిర్ణీత ధరకు అదనముగా 100 శాతము రుసుమును చెల్లించవలసి ఉంటుంది.

ఎన్.ఎ.యమ్. ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్
అత్యవసర సేవల నిమిత్తం సంప్రదించు ఫోన్ నంబర్. +91 9121282540 (ఏల్చూరు టోలు ప్లాజా)
రిజిస్టర్ ఆఫీసు: బి-376, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, నిర్మన్ విహార్, న్యూఢిల్లీ - 110092.

సంపాదకీయం

ట్రోలింగ్

సాంకేతికత పెరగడం అంటే అభివృద్ధికి ఆసరాగా నిలవటం. మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవడం. అయితే, ప్రస్తుతం సాంకేతికతను ఉపయోగించుకుని ఎదుటి వ్యక్తితో ఆడుకోవడం... మానసికంగా హింసించడం పరిపాటిగా మారింది. నేటి ఆధునిక సాంకేతికత మనిషిని మనిషిని దగ్గర చేసేదిలా ఉండాలి. మనుషుల మధ్య దూరాల్ని దారంలా కలపాలి. కానీ, కొంతమంది మాటల విరుపులతో, హింసాత్మక పద ప్రయోగాలతో, వక్రభాష్యాలతో ఎదుటివారి మనసులను గాయపరచడమే పనిగా పెట్టుకుంటున్నారు. నిరంకుశత్వం అన్ని జీవిత పార్శ్వాలను, మానవ సంబంధాలను విషపూరితం చేయడానికి కొన్ని సాంకేతిక సాధనాలను సమకూర్చుకుంటున్నది. అలాంటి వాటిలో ట్రోలింగ్ ఒకటి. భిన్నాభిప్రాయాన్ని వ్యక్తీకరించడం కోసం ఏర్పడిన ట్రోలింగ్... ఇప్పుడు అదుపుతప్పి తిట్లు, బెదిరింపులు, దాడులు, అభిప్రాయాల నిర్మూలన రూపంలోకి మారింది. ఆయా ప్రాంతాల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై ఆధారపడి ఎప్పటికప్పుడు ట్రోలింగ్ తన రూపం మార్చుకుంటున్నది. మనదేశంలో లింగ, మత, కుల వివక్ష ఆధారంగా ఎక్కువ ట్రోలింగ్ జరుగుతోంది. మరోవైపు ఇదో రాజకీయాస్త్రంగా తయారైంది. ఈ ట్రోలింగ్‌కి ఎవరూ అతీతం కాకపోయినా.. మహిళల పట్ల జరిగే ట్రోలింగ్ తీవ్రత మరింత ఎక్కువగా వుంటోంది.

'రాజకీయాలు, మతాలు స్త్రీలపై జరిపే హింసకు మధ్య సంబంధాన్ని విశ్లేషించిన ప్రతిసారీ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఐటీసెల్ పనిగట్టుకొని దాడికి దిగింది' అంటారు బాధితురాలైన ఒక సాంస్కృతిక కార్యకర్త. పేరును, ముఖాన్ని దాచుకొని అంతర్జాలం వేదికగా ఆడే విద్వేష క్రీడ ట్రోలింగ్. ఈ ట్రోలింగ్ భూతం ఎవరినీ వదిలి పెట్టడంలేదు. అమాయకులను మింగేస్తోంది. సోషల్ మీడియా ముసుగేసుకున్న సోమరిపోతులు కొందరు... ట్రోలింగ్ పేరుతో చావు డప్పు మోగిస్తున్నారు. అభ్యుదయవాదులు, కమ్యూనిస్టులు, రచయితలు, జర్నలిస్టులు, ఉపన్యాసకులు వంటి వారిపై గురిపెట్టి అశ్లీల, అసభ్య పదజాలంతో వ్యక్తిత్వ హననం లక్ష్యంగా దాడులు చేయడం మన కళ్లముందర ఆవిష్కృతమౌతున్న నగ్నదృశ్యం. కాశ్మీర్‌పై బిజెపి అనుసరిస్తున్న విధానాలపై అనేక కథనాలు రాసిన స్వాతి చతుర్వేది విపరీతమైన, ద్వేషపూరితమైన ట్రోల్‌కు గురైంది. తనపై జరుగుతున్న ట్రోల్ గురించి తెలుసుకునేందుకు ఆమె చేసిన పరిశోధనే 'ఐ యామ్ ఎ ట్రోల్' అనే పుస్తకం. బిజెపి డిజిటల్ సైన్య నిర్మాణ వ్యూహాలను ఈ పుస్తకంలో బయటపెట్టింది. అంతేకాదు... పాకిస్తాన్ మీద మ్యాచ్ ఓడిపోయినందుకు బౌలర్ మహమ్మద్ షమీ కారణమని ట్రోల్ చేస్తుంటే, షమీకి మద్దతుగా వచ్చిన విరాట్ కోహ్లీ పైనా ట్రోల్స్ జరిగాయి. తన పద్దెనిమిది నెలల కూతుర్ని రేప్ చేస్తామని ట్వీట్స్ చేశారంటే... ట్రోలింగ్ స్వభావం ఏ స్థాయికి చేరిందో అర్థమౌతుంది. తాజాగా తెనాలికి చెందిన గీతాంజలి ట్రోలింగ్ పెట్టిన హింసతో తన జీవితాన్ని బలిచేసుకుంది. ఇలాంటి సంఘటనలెన్నో నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

ట్రోలింగ్‌ని అరికట్టాల్సిన ప్రభుత్వాలే వీటిని ప్రోత్సహిస్తున్నాయి. సాక్షాత్తూ దేశ ప్రధాని సైతం ట్రోలింగ్ అకౌంట్లను ట్విటర్‌లో ఫాలో అవుతున్నట్లు కొన్ని పత్రికలు చేసిన పరిశోధనల్లో బయటపడింది. అంటే- 'ప్రశ్నించే గొంతుకలంటూ వుంటే ఇలానే పబ్లిక్‌లో హేళనకు గురికావాల్సి వస్తుంది. మిమ్మల్నే కాదూ... మీ కుటుంబాలను, అందులోనూ ఇంట్లోని ఆడవాళ్లనూ ఇందులోకి లాగుతాం. కనుక, మీ చుట్టూ ఏం జరుగుతున్నా నోరు, కళ్లు, చెవులు మూసుకుని కూర్చోండి' అనే హెచ్చరిక వుంది అంటారు సామాజిక వ్యాఖ్యాత అరుణాంక్ లత. నిరంతరం ట్రోలింగ్‌కి గురవుతున్నవారు వాటిని భరించలేక క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం మనం చూస్తూనే వున్నాం. సమాజ చైతన్యం కోసం బయటకు వచ్చే వారిని టార్గెట్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు. వీరికి లాజిక్ లేదు, విచక్షణ లేదు, మానవత్వం అంతకన్నా లేదు. ఇదొక ఉన్మాదం. ఇదిలా కొనసాగడం విజ్ఞతకు, విచక్షణకు, విజ్ఞానానికి అత్యంత ప్రమాదకరం. విచక్షణారహితంగా రెచ్చిపోతున్న సైకోలను కట్టడి చేయకపోతే ఈ ట్రోలింగ్ భవిష్యత్ తరాల్ని మానసిక వికలాంగులుగా మార్చేస్తుంది. కనుక ఈ ట్రోలింగ్ భూతాన్ని అరికట్టాలి.

మంచి మాట



నిజమైన సోషలిస్టు చైతన్యం
కలిగించాలంటే
వీరోచిత త్యాగాలు ఒక్కటే మార్గం
- చే గువేరా

ఎన్నికలకు సన్నద్ధం - వ్యవస్థపై సందేహం

ప్రస్తుతం

తెలకపల్లి రవి



> **మోడీ సర్కారు పొంతన లేని వాదనలతో కొత్త బిల్లు తీసుకొచ్చింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు(నియామక షరతులు, సర్వీసు పదవీ నిబంధనలు) బిల్లు-2023 పేరిట వచ్చిన ఈ బిల్లును రాజ్యసభ డిసెంబర్ 12న ఆమోదించింది. ప్రధానమంత్రి అధ్యక్షులుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నియమించే మరో కేంద్ర మంత్రి సభ్యులుగా కమిటీ ఈ ఎంపిక కోసం రాష్ట్రపతికి పేరు సిఫార్సు చేస్తుంది. ఇప్పటికే కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వారే ఈ పదవికి అర్హులుగా వుంటారు. అంటే నియమించే కమిటీలో ప్రధాని మాట అమలవుతుంది. నియామకానికి అర్హులైన వారు కూడా ఆ ప్రభుత్వంలో పనిచేసిన వారే అయివుండాలి. ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా వుంచాలని కోర్టు సూచనగా చెబితే దాని బదులు ప్రధాని నియమించే కేంద్ర మంత్రికి సభ్యత్వం కల్పించింది.. ప్రతిపక్ష నాయకుడికి నామకా స్థానం కల్పించినా మెజారిటీ అధికార పార్టీకే వుంటుందనేది స్పష్టం.**

ఎన్నికల నోటిఫికేషన్ వేళ వాటిని నిర్వహించవలసిన ఎన్నికల సంఘమే అనుమానాస్పద స్థితిలో చిక్కుకోవడం భారతదేశంలో ఒక విపరీతం. ఎన్నికల అక్రమాలు, అవతకతవకలు, ఒత్తిళ్లు కొత్త కాకపోయినా అసలు ఆ రాజ్యాంగ వ్యవస్థను కాపాడుకోవడమే పెద్ద సవాలుగా మారిందంటే మోడీ హయాంలో పరిస్థితి ఎలా తలకిందులైందీ తెలుసుకోవచ్చు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు ధర్మాసనం సూచనలు కూడా పెడచెవిన పెట్టడం, ఎన్నికలను ప్రభావితం చేసే నిగూఢ విరాళాల సమస్య ఈ సమయంలోనే ముందుకు రావడం, సాక్షాత్తూ ఒక మాజీ రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఎన్నికల మౌలిక సూత్రాలను ఇష్టానుసారం మార్చేసేందుకు రాజ్యాంగేతర తరహాలో సిఫార్సులను ప్రస్తుత రాష్ట్రపతి స్వీకరించడం ఇందులో ప్రతిదీ ఊహకందని స్థాయిలో జరుగుతున్నది. విడివిడిగా కనిపించే ఈ పరిణామాల మధ్య అగుపించని ఒక అదృశ్య సంబంధం వుంది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి ఎలాంటి నిర్దిష్ట నిబంధనలు లేవని సుప్రీం కోర్టు చాలాసార్లు అసంతృప్తి వెలిబుచ్చింది. కానీ మోడీ హయాంలో మిగిలిన రంగాలలో వలెనే ఇక్కడా ఏకపక్ష ధోరణి ముదిరిపోయింది. సిబిఐ, ఇడి, సివిసి వంటి పదవుల్లో ఆశ్రితులను నియమించి ప్రతిపక్షాలపై ప్రయోగించే ధోరణి పరాకాష్టకు చేరింది. ఎన్నికల సంఘం విషయంలో ఏకపక్ష నియామకాలు జరగకుండా ఒక నియామక ప్రక్రియ నిర్దేశించాలని కోరుతూ ఎడిఆర్ (అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్) తరపున 2022లో ఒక పిటిషన్ దాఖలైంది. దీన్ని త్రిసభ్య రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుండగానే సిఇసి అరుణ్ పాండే పదవీ విరమణ వచ్చింది. ఆ సమయంలోనే అరుణ్ గోయెల్ అనే కార్యదర్శి తన పదవి నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం, 24 గంటల్లోనే సిఇసిగా నియమించడం జరిగిపోయాయి.

ఎందుకింత హడావుడి?

సుప్రీం కోర్టు ఒకవైపున విచారిస్తుండగానే ఇంత హడావుడి దేనికని తీవ్ర విమర్శలు వచ్చాయి. సిఇసి పదవీ కాలం ఆరేళ్లు లేదా 65 ఏళ్లు నిండడం. ఇందులో ఏ కొలబద్దతో చూసినా గోయెల్ ఎంపికయ్యే అవకాశముండదు. తమ ముందుకు వచ్చిన నాలుగు పేర్లలోనూ గోయెల్ చిన్నవారు గనక తనను నియమించినట్టు అడ్వకేట్ జనరల్ సమర్థించుకున్నారు. ఈ నియామకాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైనప్పుడు కేంద్రం అధికారాన్ని ప్రశ్నించలేమని కోర్టు చెప్పింది. అయితే ఎడిఆర్ కేసులో దీనిపై సమగ్ర తీర్పు వస్తుందని కూడా సూచించింది. తీరా ఆ కేసు విచారణకు వచ్చినపుడు ఎజిఆర్ వెంకట్రామన్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఏకపక్షంగా సమర్థించారు. రాజ్యాంగం సిఇసి నియామకంపై ఎలాంటి నిర్దేశకాలూ చేయలేదని వాదించారు. ఏమీ చెప్పనప్పుడు మరింత జాగ్రత్తగా వుండాలని, దీనిపై ఏవైనా మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీంకోర్టు చెప్పగా అలా జోక్యం చేసుకోవాలని న్యాయ వ్యవస్థకు అధికారం ఇవ్వలేదని కూడా ఆయన అభ్యంతరం చెప్పారు. జస్టిస్ జోసఫ్ అధ్యక్షతన గల ధర్మాసనం దీనిపై తీర్పునిస్తూ సిఇసి నియామకంలో అనుసరించాల్సిన సూత్రాలపై పార్లమెంటు చట్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇచ్చిన తీర్పులో న్యాయమూర్తి రాజ్యాంగం సిఇసి కి ఎంత ప్రత్యేక స్థానం ఇచ్చిందో అంబేద్కర్ మాటల్లోనే ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం అంటేనే ఎన్నికలు సక్రమంగా జరగడమనీ, దానికి ఎన్నికల సంఘం కీలకమని అంబేద్కర్ అప్పట్లో పేర్కొన్నారు. కాగ్ వంటివాటితో పోలిస్తే ఎన్నికల సంఘం అత్యంత ముఖ్యం గనకే అందుకు ప్రత్యేక నియామక పద్ధతిని రాజ్యాంగం చెప్పిందనీ, ఇందుకు స్వతంత్రత అనేది కొలబద్ద అని స్పష్టం చేశారు. సిఇసి కార్యనిర్వాహక వర్గానికి లోబడి వుండకూడదనేది కీలక సూత్రం. పార్లమెంటు చట్టం చేసేలోగా కూడా స్వతంత్రత కాపాడేందుకు గాను ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీ రాష్ట్రపతికి సూచనలను చేయాలని నిర్దేశించారు.

తీర్పు స్ఫూర్తికి తూట్లు

ఏ తీర్పులోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి ఒబిటర్ డిక్టా, రెండు రేషియో డిసిడెండి. మొదటిది ఆదేశపూర్వకం. తప్పక అమలు చేయాలి. రెండోది ఆ తీర్పునకు మూలమైన స్ఫూర్తి వివరణ. ఈ తీర్పులో కేంద్రం చట్టంచేయాలన్నది ఆదేశమైతే సిఇసి స్వతంత్రత కాపాడాలనేది స్ఫూర్తి. సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా చేయడం ద్వారా సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. అయినా మోడీ సర్కారు పొంతన లేని వాదనలతో కొత్త బిల్లు తీసుకొచ్చింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు(నియామక షరతులు, సర్వీసు పదవీ నిబంధనలు) బిల్లు-2023 పేరిట వచ్చిన ఈ బిల్లును రాజ్యసభ డిసెంబర్ 12న ఆమోదించింది. ప్రధానమంత్రి అధ్యక్షులుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నియమించే మరో కేంద్ర మంత్రి సభ్యులుగా కమిటీ ఈ ఎంపిక కోసం రాష్ట్రపతికి పేరు సిఫార్సు చేస్తుంది. ఇప్పటికే కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వారే ఈ పదవికి అర్హులుగా వుంటారు. అంటే నియమించే కమిటీలో ప్రధాని మాట అమలవుతుంది. నియామకానికి అర్హులైన వారు కూడా ఆ ప్రభుత్వంలో పనిచేసిన వారే అయివుండాలి. ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా వుంచాలని కోర్టు సూచనగా చెబితే దాని బదులు ప్రధాని నియమించే కేంద్ర మంత్రికి సభ్యత్వం కల్పించింది.. ప్రతిపక్ష నాయకుడికి నామకా స్థానం కల్పించినా మెజారిటీ అధికార పార్టీకే వుంటుందనేది స్పష్టం. ప్రధాన కమిషనరుగా, కమిషనర్లుగా నియమించబడేవారికి సుప్రీంకోర్టు జడ్జిలతో సమానంగా జీతభత్యాలు వుండాలని తీర్పులో చెబితే ప్రభుత్వం మొదట కార్యదర్శి స్థాయి వేతనం మాత్రమే ప్రతిపాదించింది. ప్రతిపక్షాల విమర్శల తర్వాతనే దాన్ని ఆ స్థాయికి చేరుస్తూ సవరణ తెచ్చారు..కమిషన్ సభ్యులకు విధి నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలకుగాను కేసులు పెట్టే అవకాశం, తొలగింపు అధికారం లేకుండా చేయాలన్న సూచనను కూడా ఆమోదించలేదు. ఒక్క సిఇసికి మాత్రమే సుప్రీంకోర్టు జడ్జిల తరహాలో కేసుల నుంచి రక్షణ కల్పించబడింది. కోర్టుల జోక్యం కన్నా రాజకీయ జోక్యమే ఎన్నికల సంఘానికి సవాలు గనక ఆ ఒత్తిడి అలాగే వుంటుందన్న మాట. ఈ విధంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి ఎన్నికల సంఘ బిల్లు తెచ్చారని ఎంపిలు విమర్శించగా రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆగ్రహించారు. సభలో మనం స్వతంత్రంగా నిర్ణయాలు చేయాలి గాని, ఎవరి పెత్తనం మనపై వుండరాదని సూక్తులు చెప్పారు.వాస్తవంగా జరిగింది వేరు.

అయితే ఈలోగా ఏరికోరి నియమించుకున్న కమిషనర్ అరుణ్‌గోయెల్ మార్చి 9న రాజీనామా చేయడంతో కథ కొత్త మలుపు తిరిగింది..ఎన్నికల ఏర్పాట్లు తారాస్థాయికి చేరుతున్న సమయంలో ఆయన సిఇసి రాజీవ్ కుమార్ నుంచి విడగొట్టుకున్నారు. ఆయన రాజీనామా చేయడం, ఆమోదించినట్టు రాష్ట్రపతి గెజిట్ విడుదల చేయడం ఆఘమేఘాల మీద జరిగిపోయింది. గతంలో అంటే 2020 ఆగస్టులో అవోక్ లావసా అనే ఎన్నికల కమిషనర్ కూడా రాజీనామా చేశారు. 2019 ఎన్నికలలో మోడీ, అమిత్‌షాలు ఎన్నికల ప్రచార నిబంధనలను ఉల్లంఘించినందుకు నిరసనగా ఆయన రాజీనామా చేశారు. (తర్వాత ఆయనపై ఐటి తదితర దాడులు జరిగాయి. కొంతకాలానికి ఆయన ప్రభుత్వ అండదండలుండే ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఉపాధ్యక్షుడుగా నియమితుడైనాడు.) మోడీ హయాంలో ఈ విధంగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు రాజీనామా చేయడం అసాధారణమే. ఇందుకు కారణాలు మాత్రం పూర్తిగా రహస్యంగా వుండిపోయాయి..

ప్రతిపక్ష నేత చెప్పిన సత్యాలు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల ముందు ఇద్దరు కొత్త కమిషనర్లను నియమించిన తీరు కూడా చాలా అభ్యంతరకంగా వుంది.14వ తేదీన ఈ నియామకానికి నిర్ణయించడానికి గాను ప్రధాని, హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నాయకుడు అధీర్ రంజన్ చౌదరి సమావేశమైనారు. మాజీ ఐఎఎస్ అధికారులైన సుఖ్‌వీర్ సింగ్ సంధు, జ్ఞానేశ్ కుమార్‌లు నియమితులైనట్టు అధీర్ వెల్లడించారు. దీన్ని వెంటనే అధికారికంగా ధృవీకరించలేదు. వాస్తవానికి ఈ నియమాకం దౌర్జన్య తరహా రిగ్గింగ్ పద్ధతిలో జరిగిందని ఆయన విమర్శించారు. తనకు 212 మంది అధికారుల జాబితాను సమావేశానికి ముందు రోజు రాత్రి ఇస్తే ఎలా పరిశీలించగలనని ఆయన ప్రశ్నించారు. ఇక సమావేశానికి పది నిముషాల ముందు, ఇందులో పదిమంది పేర్లతో మరో చిన్న జాబితా ఇచ్చి ఎంపిక చేయమని కోరారనీ, ఇందులో మళ్లీ ఆరుపేర్లు ప్రతిపాదించి, మెజారిటీ నిర్ణయంగా పై ఇద్దరినీ ఎంపిక చేశారని వెల్లడించారు .ప్రభుత్వం ముందే నిర్ణయించుకున్న పేర్లనే అక్కడ ఆమోదించినట్టు ప్రహసనం నడిపించారని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికల కమిషనర్ల స్థానాలు ఖాళీగా వుండరాదనే ఉద్దేశంతోనే తాను సమావేశానికి హాజరయ్యానని వివరించారు. కనుక అందరూ భయపడినట్టే ఇది పూర్తిగామోడీ కనుసన్నలలో జరిగిన వ్యవహారం తప్ప ఎంపిక ఏమీ లేదన్నమాట. మరి ఇలాటి కమిషన్ కీలకమైన ఎన్నికల నిర్వహణ ఏ విధంగా చేస్తుందో చెప్పనవసరం లేదు.

ఇప్పటికే ఓటరు వేసిన ఓటు నిర్దేశించిన అభ్యర్థికే పడుతుందో, లేదో పరిశీలించేందుకు ఉద్దేశించిన వివి పాట్ వివాదం అలాగే వుంది. అసలు ఇవిఎంల పనితీరుపైనే బోలెడు ప్రశ్నలున్నాయి. ఇటీవలనే ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్ఫూర్తి అమలు కావలసే వుంది. ఈ బాండ్ల అమ్మకాలు పంపిణీ వివరాలు ఎన్నికల సంఘానికి అందించాలని సంబంధిత స్టేట్‌బ్యాంకును అడిగితే మరింత సమయం కావాలని కోరి అక్షింతలు వేయించుకుంది. సుప్రీం అక్షింతలు వేశాక అనివార్యంగా స్టేట్ బ్యాంకు ఇసికి అందజేసిన వివరాలు అరకొరగా వుండటంతో మళ్లీ ఆగ్రహం వెలిబుచ్చాల్సి వచ్చింది. అందిన మేరకు చూసినా బిజెపి కార్పొరేట్ ప్రాపకం తెలిసిపోయింది. మొత్తం 12వేలకోట్ల రూపాయలకు పైగా బాండ్లు కార్పొరేట్ సంస్థలు కొంటే.. అందులో ఆరువేల కోట్లపైన బిజెపి కే చేరాయి.కాంగ్రెసు 1400 కోట్లు, కమ్యూనిస్టు వ్యతిరేక తృణమూల్ తర్వాత స్థానంలో 1200 కోట్ల వరకూ పొందాయి. (ఈ వివరాలు ప్రజాశక్తి ఇచ్చింది) అయితే అవినీతిపై పోరాటం అంటూ చిందులు తొక్కే అమిత్ షా 303 మంది ఎంపిలు వున్న మా పార్టీకి ఈ మాత్రం విరాళం. వస్తే ఏం తప్పు?అని ఎదురు దాడి మొదలెట్టారు.ఏమైనా జాతీయ, ప్రాంతీయ పాలక పార్టీలన్నీ ఈ ప్రభావంలో వున్నాయి. ఈ మురికి అంటని పార్టీ సిపిఎం. ఇంత ప్రభావం చూపే ధనపు సంచులు, ఇంత తప్పు పద్ధతిలో కమిషనర్ల నియామకం మధ్య విశ్వసనీయత ఏమయ్యేట్టు?ఆఘమేఘాల మధ్య నియమితులైన ఇద్దరితో కలసి ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ బృహత్ ఎన్నికల కార్యక్రమం ప్రకటించారు. ఏప్రిల్ 18న మొదలై జూన్ 1న ముగిసే ఈ కీలక సమరం ఫలితాలు జూన్ 4న తెలుస్తాయి.మే 13న జరిగే ఏపి ఎన్నికల ఫలితాల కోసం మరింత ఉత్కంఠగా ఎదురు చూడాల్సిందే. కాకుంటే ఈ వివాదాస్పద వాతావరణం దాన్ని మరింత పెంచడం తథ్యం.

పౌరసత్వ సవరణ చట్టం-కథాకమామీషు

విశ్లేషణ

గుమ్మడిదల రంగారావు

భారత పౌరసత్వ చట్టానికి 2019లో పార్లమెంటు ఒక వివాదాస్పదమైన సవరణ చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ చట్టాన్ని అమలు చెయ్యటానికి సంబంధించిన నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఈనెల 11వ తేదీన రాజపత్రంలో ప్రచురించిన నేపథ్యంలో ఈ వివాదం మరోసారి తెరమీదకు వచ్చింది. ఈ సవరణ చట్టంలో ఉన్న వివాదాస్పద విషయం ఏంటంటే మొట్టమొదటిసారి భారత పౌరసత్వాన్ని పొందటానికి మతం ఒక ప్రాతిపదిక అయింది! సవరించిన చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్ మరియు ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మత ప్రాతిపదికన వివక్షతకు, వేధింపులకు గురై మన దేశానికి శరణు వచ్చిన హిందు, క్రిస్టియన్, బౌద్ధ, పార్శీ, సిక్కు మరియు జైన మతాలకు చెందిన వారు భారత పౌరసత్వం త్వరితగతిన పొందటానికి వీలు కలుగుతుంది. పాత చట్టం ప్రకారం విదేశీయులు నేచురలైజేషన్ ప్రక్రియ ద్వారా పౌరసత్వం పొందటానికి భారత్ లో 11 ఏళ్ళు నివాసం వుండాలి. సవరించిన చట్టం ప్రకారం ఆ కాలపరిమితిని ఐదేళ్లకు కుదించారు. అయితే ముస్లింలకు ఈ వెసులుబాటు వర్తించదు. ప్రభుత్వ వాదన ఏంటంటే... ఈ మూడు దేశాల్లో ఇస్లాం అధికారిక మతం అయినందున ఆ దేశాల్లో ముస్లింలు మత ప్రాతిపదికన ఏ విధంగా వేధింపులకు గురవుతారు అని? శ్రీలంకలో హిందువులు వివక్షతకు, వేధింపులకు గురై దేశం వదిలి భారత్‌లో తలదాచుకుంటున్నారు. మరి వారిని ఎందుకు విస్మరించింది ఈ చట్టం? ఇక్కడ వాస్తవం ఏంటంటే... ఎక్కడో వివక్షతకు గురైన పార్శీలకు పునరావాసం కలిపించే వంకతో ఇక్కడ ముస్లింలను వివక్షకు, అభద్రతకు గురిచెయ్యటమే ఈ చట్ట ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తున్నది. ఈ చట్టం భారతీయ స్ఫూర్తికి విరుద్ధంగా వున్నది. ఎవరినైనా ఈ గడ్డమీదకు ఆహ్వానించటం, ఆదరించటం భారతీయుల నైజం. బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో వేలకొలది ఆ దేశం నుంచి మన దేశంలోకి శరణార్థులుగా వచ్చారు. ఏ మతం అనేది చూడకుండా అందరినీ అక్కున చేర్చుకున్నాం, ఆదరించాం. నాటి ఆంధ్రప్రదేశ్ లో కూడా అలా శరణార్థులుగా వచ్చి స్థిరపడ్డవారున్నారు. లౌకికవాదం రాజ్య విధానమని మన రాజ్యాంగం స్పష్టంగా విశదీకరిస్తున్న నేపథ్యంలో పౌరసత్వం పొందటానికి మతాన్ని ఒక ప్రాతిపదిక చెయ్యడం మరియు ఒక మతం వారికి సవరించిన చట్టం వర్తించదు అని చెప్పటం రాజ్యాంగ ఉల్లంఘనే అని మేధావులు, న్యాయకోవిదులు స్పష్టం చేస్తున్నారు. రాజ్యాంగంలోని 14 వ అధికరణం భారత భూభాగంలో వున్న ఏ వ్యక్తికీ చట్టం ముందు సమానత్వాన్ని, చట్టం కల్పించే భద్రతను రాజ్యం నిరాకరించదు అని పేర్కొంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే ...ప్రాథమిక హక్కుల్లోని ఒక్క 14వ అధికరణంలోనే వ్యక్తి అనే మాట వుంటుంది. ప్రాథమిక హక్కులకు సంబంధించిన మిగతా అధికరణాలలో పౌరుడు అనే మాట వుంటుంది గానీ వ్యక్తి అని వుండదు. అంటే చట్టం ముందు ఏ వ్యక్తి అయినా, అతడు పౌరుడైనా పరదేశీ అయినా, సమానమే అని రాజ్యాంగం చెబుతోంది. మరియు చట్టం కల్పించే భద్రత ఈ భూభాగంలో ప్రతి వ్యక్తికీ వర్తిస్తుందని ఈ అధికరణం స్పష్టంగా చెబుతున్నది. మరి పౌరసత్వ సవరణ చట్టం ముస్లింలకు వర్తించదు అనే వాదన రాజ్యాంగ విరుద్ధమే కదా! పార్లమెంటు ఆమోదించిన బిల్లు రాష్ట్రపతి ఆమోదించిన పిదప చట్టం అవుతుంది. అయితే చట్టాన్ని రాజపత్రంలో ప్రచురించిన తరవాతే చట్టం అమలులోకి వస్తుంది. అలా ప్రచురించనంతవరకు చట్టం అమలుకు నోచుకోదు. అయితే ఇది రాజ్యాంగ సవరణకు వర్తించదు. పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చెయ్యటానికి సంబంధించిన నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు రావటానికి కేవలం వారం రోజుల ముందు రాజపత్రంలో ప్రచురించటం ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందటానికే అని చాలామంది భావిస్తున్నారు. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం తప్పుకాదు.

నెల్లూరులో సిపిఎం, పౌరసంఘాల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ప్రదర్శన (ఫైల్)

కానీ రాజకీయ ప్రయోజనం కోసం రాజ్యాంగ మౌలిక స్వరూపంతో ఆటలాడుకోవటం విచారకరం. ఎన్నికలు ఐదేళ్లకు ఒకసారి వస్తూనేవుంటాయి. ఒక్కో ఎన్నికలో ఒక్కో విషయం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అది ఆ ఎన్నిక వరకు పరిమితమవు తుంది. కానీ రాజ్యాంగానికి ఒక పవిత్రత, ప్రతిష్ట వుంది. అది శాశ్వత శాసనం. పార్లమెంటు చేసే ఏ శాసనమైనా ప్రాథమిక శాసనానికి లోబడే వుండాలి గానీ, దాన్ని అధిగమించేదిగా ఉండరాదు. ఇది కూడా రాజ్యాంగం స్పష్టంగా చెబుతున్న విషయమే. ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి కేవలం వారం రోజుల ముందే ఈ వివాదాస్పద అంశానికి మరోసారి తెరలేపడంలో ఉద్దేశం రాబోయే ఎన్నికల్లో హిందువులను ఒక వైపున మొహరించడానికేనని చాలా మంది భావిస్తున్నారు. ఇప్పటివరకు హిందువులు జాతీయ స్థాయిలో మతప్రాతిపదికన ఓటు బ్యాంకు అవ్వలేదు. కానీ సంఘ పరివార్ హిందువులను ఒక ఓటు బ్యాంకుగా మార్చాలని గట్టి ప్రయత్నమే చేస్తోంది. హిందువులందరి తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడే హక్కు ఎవరికీ లేదు. కానీ హిందూత్వ వాదులు ఈ వైవిధ్య స్ఫూర్తిని ఛిద్రం చేయాలని కోరుకుంటున్నారు. హిందువుల్లో వైష్ణవులు, శైవులు, ఉత్తరాది, దక్షిణాదివారి సంప్రదాయాలు వైవిధ్యభరితంగా వుంటాయి. పైగా విశ్వాసం అనేది వ్యక్తిగతం అని రాజ్యాంగంలో లిఖించుకున్నాం. విశ్వాసం అనేది పరిపాలనకు, రాజ్య వ్యవస్థకు ప్రాతిపదిక కారాదు. ఈ అభిప్రాయం నేడు అపాయంలో పడింది. భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతం ఆధారంగా మన జాతి నిర్మాణం జరగాలని స్వాతంత్ర సమరయోధులు, రాజ్యాంగ సృష్టికర్తలు కోరుకున్నది నేడు ప్రశ్నార్థకమైంది. భిన్నత్వ స్ఫూర్తికి భిన్నంగా నేడు రాజ్య విధానం సాగుతోంది. హిందుత్వ వాదులకు భిన్నత్వం గిట్టదు. ఐక్యం కన్నా ఏకీకరణ ముద్దు. వారికి యూనిటీ కన్నా యూనిఫార్మిటీ ముఖ్యం. అందరూ ఒకే భాష మాట్లాడాలి. ఒకే సంస్కతిని పాటించాలి. జాతి బలపడటానికి ఏకీకరణే ప్రాతిపదిక కావాలనేది హిందూత్వ వాదుల లక్ష్యం. హిందీ భాష, ఏకరూప పౌర స్మృతి, ఒక దేశం ఒక ఎన్నిక వంటి అంశాలు ఏకీకరణ ఉన్మాదంలో ముఖ్యమైన మెట్లు. అయితే, హిందూత్వ వాదుల లక్ష్యం నెరవేరదు. సముద్రంలో నీళ్లు తోడిపొయ్యాలనుకోవటం లాంటిదే వారి ప్రయత్నం. కానీ వారు చేసే ప్రయత్నం వలన తగిలే గాయం త్వరగా మానదు. ఈ విషపూరిత, విధ్వంసకర ధోరణిని విశాల దక్పథంతో హిందువులు గమనించాలి. పరిపాలనకు ప్రాతిపదిక మత మౌఢ్యమా, ఆధునిక దక్పథమా అన్న సంఘర్షణను దేశం ఎదుర్కొంటోంది నేడు. విశ్వాసానికి, రాజ్యవిధానానికి మధ్య ఉండవలసిన స్పేస్ క్రమేణా కుచించుకుపోతూవుంది. గత దశాబ్ద కాలంలో. రాజ్యాంగ వ్యవస్థలు కూడా బలవుతున్నాయి ఈ ధోరణితో. దేవాలయాలు కట్టటం, వాటిని ప్రారంభించటం వంటి విషయాల్లో రాజ్యానికి పెద్దగా ప్రమేయం ఉండేది కాదు గతంలో. కేవలం నియంత్రణ వరకే రాజ్యం పరిధి ఉండేది. నేడు నియంత్రణ కన్నా దేవాలయాల నిర్మాణం, నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది రాజ్యం. తద్వారా హిందువులు ఒక ఓట్ బ్యాంకుగా ఏర్పడితే ఎన్నేళ్లైనా రాజ్యాధికారం హిందుత్వ వాదుల చేతుల్లో ఉంటుంది. వారి విజయానికి ఢోకా వుండదనేది ప్రధాన ఉద్దేశం. దీనికి ఊ అనాలా... ఉహూ అనాలా అనేది భారతీయులందరూ లోతుగా ఆలోచించి నిర్ణయించాలి. దానికి ఎన్నికలే సరైన సందర్భం. ప్రజలు పరిపాలనా విషయాల పట్ల ఆసక్తి చూపకపోతే, మూర్ఖుల పాలనలో బతకవలసి వస్తుందని ప్లేటో మహాశయుడు ఏనాడో చెప్పాడు.

జనవాక్యం

పదేళ్ల నిర్లక్ష్యంపై ప్రధాని నోరువిప్పాలి

గత పదేళ్లుగా ..దేశంలో ఎక్కడా లేని అరాచక పాలన సాగుతోంది. అరికట్టడానికి మీకు చేతనైనా... వాళ్ల చావు వాళ్లు చస్తారులే అన్నట్లుగా చూస్తుండి పోయారు .. మీతో పొత్తు ధృత రాష్ట్ర కౌగిలి కాకూడదు . 2014 ఎన్నికల సందర్భంలో.... విదేశాల్లోని భారతీయుల నల్లడబ్బు తెచ్చి ఇక్కడ మనిషికి 15 లక్షలు రూపాయల చొప్పున వారి ఖాతాల్లో వేస్తామని మీరే స్వయంగా చెప్పారు . దాని సంగతి ఏమయింది ? విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటు వ్యక్తులకు అమ్మటాన్ని గురించి చెప్పండి. టెలిఫోన్స్, బ్యాంకులు , నౌకాయానాలు ,రోడ్లు, రైల్వే స్టేషన్లు అదీ ఇదీ అని లేకుండా అన్నింటినీ ప్రయివేటుపరం చేస్తున్నారు . చివరికు రైల్వేలో టికెట్ ధరలో వృద్ధులకు ఇచ్చే రాయితీ కూడా తొలగించారు. వందే భారత్ రైళ్లంటూ అన్నీ ఎసి రైళ్లు వేసి , సామాన్యుడు ఎక్కకుండా చేస్తున్నారు .రాజ్యాంగంలో రాసుకున్న లౌకిక వాదాన్ని తొలగించాలని చూస్తున్నారు ..విద్యార్థులకు పాఠ్యాంశాల్లో చరిత్ర పాఠాలు తొలగించి, వాటి స్థానంలో పుక్కిటి పురాణాలను ప్రవేశపెడుతున్నారు . సైన్సు కాంగ్రెసు సభలను నాన్సెన్స్ సభల్లాగా తయారుచేస్తున్నారు . మనుషుల స్థానంలో ఆవులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. 17 తేదీన చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగే సభలో వీటన్నిటి గురించి చెప్పవలసిన బాధ్యత ప్రధానిగా మీకు ఉన్నదని భావిస్తున్నాం..

నార్నె వెంకటసుబ్బయ్య
అధ్యక్షుడు
ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం.

ప్రసార భారతి కొత్త చైర్మన్‌గా మాజీ ఐఎఎస్ నవనీత్ కుమార్ సెహగల్

న్యూఢిల్లీ : నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న ప్రసార భారతి చైర్మెన్ పోస్ట్ ఎట్టకేలకు భర్తీ అయింది. రిటైర్డ్ బ్యూరోక్రాట్ నవనీత్ కుమార్ సెహగల్ ఆ స్థానంలో నియమితులయ్యారు. 70 ఏళ్లు నిండిన తర్వాత 2020, ఫిబ్రవరిలో సూర్య ప్రకాశ్ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయన స్థానంలో సెహగల్ వచ్చారు. "సెలక్షన్ కమిటీ సిఫారసుపై రాష్ట్రపతి రిటైర్డ్ ఐఎఎస్ నవనీత్ కుమార్ సెహగల్‌ను నియమించారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియామకం అమలులోకి రానున్నది. మూడేళ్ల కాలవ్యవధి లేదా ఆయనకు డెబ్బై ఏళ్లు వచ్చే వరకు(ఏది ముందుగా అయితే అది) ఆయన ఆ పదవిలో ఉంటారు" అని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు పేర్కొన్నది. దేశ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ చైర్మెన్‌ను ఎంపిక చేసేందుకు ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రసార భారతి చైర్మెన్ పదవికి ఎంపిక చేసే ప్యానెల్‌కు రాజ్యసభ చైర్మెన్ కూడా అయిన ఉపరాష్ట్రపతి నేతృత్వం వహిస్తారు. ఈ సమావేశంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా దేశాయ్ (రిటైర్డ్), సమాచార, ప్రసార కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

జాతి వ్యతిరేక ముద్ర వేసి ప్రభుత్వ టీచర్ తొలగింపు

- గవర్నర్ కాశ్మీరీల జీవనోపాధులను లాక్కుంటున్నారంటూ మెహబూబా విమర్శ

శ్రీనగర్ : వీధి నిరసనల్లో పాల్గొన్నారంటూ జాతి వ్యతిరేక ముద్ర వేసి ప్రభుత్వ టీచర్‌ను విధుల నుండి తొలగిస్తూ జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం తీసుకున్న చర్యను మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి తీవ్రంగా విమర్శించారు. 'జాతి వ్యతిరేక' ముద్రతో మరో ఉద్యోగి బలయ్యాడు' అని ఆమె వ్యాఖ్యానించారు. తొలగించబడిన ఉద్యోగి కుల్గామ్ జిల్లాకు చెందిన మంజూర్ అహ్మద్ లావే విద్యా శాఖలో టీచర్‌గా చేస్తున్నారు. 2016లో ఆయన ఆందోళనల్లో పాల్గొన్నారనే ఆరోపణలపై సవరించిన ఆర్టికల్ 311ను ఉపయోగించి తొలగించారు. ఈ నిబంధనలను ఉపయోగించి ఇప్పటివరకు 56మంది ప్రభుత్వ అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ పాలనా యంత్రాంగం తొలగించింది.

2019 నుండి కుంభకోణాలు, పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రతి రిక్రూట్‌మెంట్‌ను రద్దు చేస్తున్నారు. ఒకవైపు యువతకు ఉపాధి దొరక్కుండా చేస్తున్నారు. మరోపక్క ఉద్యోగుల నుండి ఉద్యోగాలను లాక్కుంటున్నారు. ఇలా మొత్తంగా కాశ్మీరీల జీవనోపాధులను హరించివేస్తూ, వారి చర్యలను నేరపూరితం చేయడమంటే వారికి ఇది సమిష్టి శిక్ష తప్ప మరొకటి కాదు." అని మెహబూబా ఎక్స్‌లో శనివారం పోస్ట్ చేశారు.

జెకెఎల్‌ఎఫ్‌పై నిషేధం పొడిగింపు

శ్రీనగర్ : కాశ్మీర్ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్‌కు చెందిన జమ్ము అండ్ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్‌ఎఫ్)పై నిషేధాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శనివారం ప్రకటించారు. జెకెఎల్‌ఎఫ్ సంస్థ జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించే కార్యకలాపాలను కొనసాగిస్తోందని అమిత్‌షా ఎక్స్‌లో పేర్కొన్నారు. జమ్ము అండ్ కాశ్మీర్ పీపుల్స్ లీగ్ (జెకెపిఎల్)కి చెందిన నాలుగు సంస్థలు జెకెపిఎల్ (ముక్తర్ అహ్మద్ వాజా), జెకెపిఎల్ (బషీర్ అహ్మద్ తోట), జెకెపిఎల్ (గులాం మొహమ్మద్ ఖాన్), జెకెపిల్ (అజీజ్ షేక్)లను చట్టవిరుద్ధమైనవిగా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఎ) పేర్కొంది. ఉగ్రవాద నిరోధక చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967 (యుఎపిఎ) కింద 2019లో జెకెఎల్‌ఎఫ్‌ని ఎంహెచ్‌ఎ నిషేధించింది.

బిజెపికి ధన ప్రవాహం

- 2019 ఎన్నికలకు ముందు రూ.1,700 కోట్ల ఎన్నికల బాండ్ల ఎన్‌క్యాష్
- ఈ ఏడాది ఇప్పటికే రూ.202 కోట్లు సమకూర్చుకున్న వైనం
- ఐదేళ్లలో పార్టీలన్నీ ఎన్‌క్యాష్ చేసుకున్న మొత్తం రూ.12,769 కోట్లు
- ఇందులో సగభాగం కాషాయ పార్టీదే



న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి సర్కారు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం ఆ పార్టీకి భారీగా విరాళాలను తీసుకొచ్చింది. 2019 నుంచి 2024 మధ్య అన్ని పార్టీల కంటే ఆ పార్టీకే ఎన్నికల బాండ్ల ద్వారా ఎక్కువ విరాళాలు వచ్చాయి. బాండ్లను అధీకృత బ్యాంకులలో నగదుగా మలుచుకోవటం (ఎన్‌క్యాష్‌మెంట్)లోనూ బిజెపినే ముందున్నది. గత ఐదేండ్లలో రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసిన రూ.12,769 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లలో దాదాపు సగభాగాన్ని బిజెపి కైవసం చేసుకున్నది. ఇందులో మూడింట ఒక వంతు 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో వచ్చింది. ఇక కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది జనవరిలో పార్టీ ఇప్పటికే రూ.202 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను క్యాష్ చేసింది. ఎలక్టోరల్ బాండ్లను తీసుకునేది లేదని స్పష్టం చేయడంతోపాటు అందుకు అవసరమైన అకౌంట్ కూడా తీసుకోని పార్టీ సిపిఎం ఒక్కటే కావడం గమనార్హం. ఈ బాండ్లను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన పార్టీ కూడా సిపిఎం ఒక్కటే.

భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎలక్టోరల్ బాండ్ డేటా ప్రకారం.. రాజకీయ పార్టీలలో అత్యధిక మొత్తంలో ఎలక్టోరల్ బాండ్లను (మొత్తం రూ.6,060.52 కోట్లు) బిజెపి ఎన్‌క్యాష్ చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికలు, 2023 నవంబర్‌లో తెలంగాణతో సహా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన ఎన్నికల సమయంలో ఆ పార్టీ అత్యధికంగా ఎలక్టోరల్ బాండ్లను ఎన్‌క్యాష్ చేసుకున్నది.

ఏప్రిల్ 12, 2019 నుంచి ఈ ఏడాది జనవరి 24 వరకు పార్టీ రీడీమ్ చేసిన మొత్తం సొమ్ములో మూడింట ఒక వంతు.. 2019లోని ఏప్రిల్, మే నెలల్లోనే (ఏప్రిల్ 2019లో రూ.1,056.86 కోట్లు, మే 2019లో రూ.714.71 కోట్లు) కావటం గమనార్హం. నవంబర్ 2023లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో అది రూ.702 కోట్లుగా ఉన్నది. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నప్పుడు జనవరి 2022లో (రూ.662.20 కోట్లు) ఎలక్టోరల్ బాండ్లను నగదుగా మలుచుకోవటం పెరిగింది. మళ్లీ నవంబర్ 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలు ఎన్నికలు జరిగినప్పుడు ఇది పునరావృతమైంది.

బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ తర్వాత పార్టీలలో మూడో అత్యధిక మొత్తాన్ని పొందిన కాంగ్రెస్.. ఐదేళ్ల కాలంలో మొత్తం రూ.1421.87 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందుకున్నది. అక్టోబర్ 2023లో తెలంగాణతో సహా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ పార్టీ రూ.401.91 కోట్లతో మూడు రెట్లు అధికంగా ఎలక్టోరల్ బాండ్లను నగదుగా మలుచుకున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు కంటే (ఏప్రిల్ 2019లో రూ.118.56 కోట్లు) ఇది ఎక్కువ కావటం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో బాండ్ల ఎన్‌క్యాష్ ద్వారా కాంగ్రెస్ రూ.35.9 కోట్లను ఆర్జించింది.

ప్రజాస్వామ్యంలో దేన్నీ దాచివుంచలేం!

- దాతల గోప్యతకై వ్యవస్థాగత యంత్రాంగం రూపొందించాలి
- సిఇసి రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యంలో దేన్నీ దాచిపెట్టడానికి ఎలాంటి అవకాశం వుండదని చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల విక్రయాలు, కొనుగోళ్ల వ్యవహారానికి సంబంధించిన వివరాలన్నీ బహిర్గతమవుతున్న నేపథ్యంలో ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలకు సంబంధించి దాత గోప్యతతో పారదర్శకతను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. దాతల గోప్యతకు ఒక వ్యవస్థాగత యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని కూడా పరిశీలించాల్సి వుందని సిఇసి నొక్కి చెప్పారు. "మొదటినుండి పారదర్శకత వుండాలనే కమిషన్ చెబుతూ వస్తోంది. సుప్రీంకోర్టులో ఇందుకు సంబంధించి మా వైఖరి కూడా తెలియచేశాం. అన్ని విషయాలు అందరికీ తెలియడమే ప్రజాస్వామ్యం" అని అన్నారు. దాతల గోప్యతను పాటించేందుకు ఒక వ్యవస్థాగత యంత్రాంగాన్ని ఇప్పుడు దేశం రూపొందించాల్సి వుందన్నారు. రాజకీయ పార్టీలు తమ వార్షిక ఖర్చులు, విరాళాల వివరాలను అందజేయాలని, వాటిని ఇసి వెబ్‌సైట్‌లో ప్రచురిస్తామని తెలిపారు. లెక్కకు రాని రూపాల్లో వచ్చే విరాళాలను కూడా ఎలా నియంత్రించాలనేది దేశం మొత్తం కలిసి పనిచేయాల్సిన విషయమన్నారు. దాతల గోప్యతను కాపాడడం, వారు వేధింపులకు గురి కాకుండా చూడడం, ఆ నిధులు ఏ ఏ మార్గాల ద్వారా రావాలి వంటి అంశాలన్నింటినీ కలిసికట్టుగా పనిచేసి నిర్ణయించాల్సి వుందన్నారు. ఈ డిజిటల్ యుగంలో నగదు రూపాన్ని తగ్గించాల్సి వుందన్నారు. ఇంతకంటే మెరుగైన వ్యవస్థ కచ్చితంగా వస్తుందని అన్నారు.

543 కాదు, 544 సీట్లకు పోలింగ్? : 'అదనపు సీటు'ను వివరించిన సిఇసి

పార్లమెంట్ నియోజకవర్గాలు 543 వుండగా 544 స్థానాలకు ఎన్నికలు ప్రకటించారంటూ ఒక రిపోర్టర్ ప్రశ్నించడం పట్ల చీఫ్ ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తూ ఆయన చేసిన ప్రసంగంలో అనేక వివరాలు వుండగా, ఒక రిపోర్టర్ మాత్రం ఆసక్తికరమైన అంశాన్ని లేవదీశాడు. వెంటనే రాజీవ్ కుమార్ ఆ వ్యక్తిని అభినందించారు. 544 సీట్లకు ఎన్నికలు ప్రకటించడానికి గల కారణాన్ని వివరించారు. అదనపు సీటుకు ఎన్నికంటూ ఏమీ లేదని చెప్పారు. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఔటర్ మణిపూర్ నియోజకవర్గంలో ఓటింగ్‌ను రెండుసార్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. "మణిపూర్‌లో నెలకొన్న వాస్తవిక పరిస్థితులను కమిషన్ సమీక్షించింది. వేర్వేరు నియోజకవర్గాల్లో నమోదైన పెద్ద సంఖ్యలో ఓటర్లు ఇటీవలి ఘర్షణల కారణంగా వేర్వేరు ప్రాంతాలకు తరలివెళ్లిపోయారు. వివిధ జిల్లాల్లోని సహాయ శిబిరాల్లో వారు ప్రస్తుతం నివసిస్తున్నారు. వివిధ పక్షాలతో కమిషన్ చర్చలు జరిపిన మీదట సహాయ శిబిరాల వద్ద ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం." అని ఎన్నికల కమిషన్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. మణిపూర్‌లో అంతర్గతంగా నిర్వాసితులైన వారు సహాయ శిబిరాల్లో ఓటు వేయడానికి గానూ ఫిబ్రవరి 29న ఒక ప్రత్యేక పథకాన్ని జారీ చేశామని ఆ ప్రకటనలో తెలిపింది.

అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ లెఫ్ట్ ఫ్రంట్ మార్చ్

కొల్‌కతా : వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ లెఫ్ట్ ఫ్రంట్ శనివారం కొల్‌కతాలో మార్చ్ నిర్వహించింది. ధర్మతల నుంచి పార్క్ సర్కస్ వరకు ఈ పాదయాత్ర సాగనుంది.రాష్ట్రంలోని 16 లోక్‌సభ స్థానాలకు లెఫ్ట్ ఫ్రంట్ తన అభ్యర్థులను ప్రకటించింది. 'బంగ్లా బచావో–దేశ్ బచావో' అన్న నినాదాలు హోరెత్తాయి. ఈ ఎన్నికల్లో ' బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలను ఓడించండి–ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, పౌర హక్కులను కాపాడండి' అని ప్రజానీకానికి లెఫ్ట్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. అవినీతి, దోపిడీని నిరోధించేందుకు తీర్పు ఇవ్వండి. పార్లమెంట్‌లో ప్రజల గొంతుకను బలపరిచేందుకు వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల అభ్యర్థులను గెలిపించండి అని లెఫ్ట్ ఫ్రంట్ నేతలు కోరారు. పౌరసత్వ సవరణ చట్టం పేరుతో విభజన రాజకీయాలను ఆపాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిజెపి మనీలాండరింగ్‌కు పాల్పడిందని, ఆ డబ్బు అంతటిని కక్కించాలని లెఫ్ట్ ఫ్రంట్ నేతలు కోరారు.

పలు రాష్ట్రాల్లో బిజెపి నేతల రాజీనామాలు

కర్ణాటక బిజెపి నేత ఈశ్వరప్ప తిరుగుబాటు

న్యూఢిల్లీ : పలు రాష్ట్రాల్లో బిజెపి సీనియర్ నాయకులు ఆ పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ బయటకు వస్తున్నారు. కర్ణాటకకు చెందిన ఆ పార్టీ సీనియర్ నేత కెఎస్ ఈశ్వరప్ప తిరుగుబాటు చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో శివమొగ్గ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని శుక్రవారం ప్రకటించారు. తన మద్దతుదారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు ప్రకటన చేశారు. తన కుమారుడికి హవేరీ నియోజకవర్గం టికెట్ నిరాకరించడానికి మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడియూరప్ప కారణమని అన్నారు.

మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యుడు అజయ్ ప్రతాప్ సింగ్ రాజీనామా

మధ్యప్రదేశ్‌లో బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యుడు అజయ్ ప్రతాప్ సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విడి శర్మకు తన రాజీనామా లేఖలు పంపించారు. 2018 మార్చిలో బిజెపి ఆయనను రాజ్యసభకు నామినేట్ చేసింది.

భారత సంతతి కుటుంబం అనుమానాస్పద మృతి

టొరంటో : భారత సంతతికి చెందిన దంపతులు, వారి కుమార్తె కెనడాలోని అంటారియో ప్రావిన్స్‌లో అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయారు. రాజీవ్ వారికూ (51), అతని భార్య శిల్పా కోతా (47), కుమార్తె మహేక్ వారికూ (16) మరణించారు. ఈ ఘటన ఈ నెల 7న జరగగా.. మతదేహాలను శుక్రవారం గుర్తించారు. ఇంట్లో అగ్నిప్రమాదం వల్లే మరణించినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే తదుపరి విచారణలో అనుమానాస్పదంగా మరణించినట్లు తేలింది. ఇంట్లో నుంచి భారీ పేలుడు శబ్దం వినిపించిందని ఇరుగుపొరుగు వారు తెలిపారు. రాజీవ్ వారికూ 2016 వరకు టొరంటో పోలీస్‌లో వాలంటీర్‌గా ఉన్నారు. మహేక్ ఒక ఫుట్‌బాల్ క్రీడాకారిణి.

CHANGE OF NAME

I, **LAXMI KATHYAYANI. M (Old Name) D/o SUBRAH MANYAM. M** Resident of F.No.1034, Akash Towers, Lotus Landmark. Ayodhya Nagar, Vijayawada, NTR District, PIN: 520003, AP, I have changed my name as **TAYI LAKSHMI KATYAYANI (New Name), W/o TAYI VENKATA NARASIMHA RAO,** Hereafter my name is Known as **TAYI LAKSHMI KATYAYANI (New Name) W/o TAYI VENKATA NARASIMHA RAO**

ఆరు వారాల పాటు కాల్పుల విరమణ!

- హమాస్ తాజా ప్రతిపాదన
- 24 గంటల్లో 149 మంది పాలస్తీనియన్ల మృతి
- రఫాపై దాడికి నెతన్యాహు యత్నం

గాజా : గాజాలో ఆరు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయాలంటూ హమాస్ కొత్తగా ప్రతిపాదించింది. ఈ సమయంలో పాలస్తీనియన్ ఖైదీలను విడుదల చేస్తే అందుకు ప్రతిగా తమ వద్ద బందీలుగా వున్న 42 మందిని విడుదల చేస్తామని పేర్కొంది. "ఆరు వారాల పాటు కాల్పుల విరమణకు, ఖైదీల మార్పిడికి ఒప్పందం కుదుర్చుకోవాలి" అని హమాస్ వర్గాలు తెలిపాయి. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని గత కొద్ది వారాలుగా అనేక దఫాలుగా చర్చలు జరిగాయి. ఇజ్రాయిల్ మొండివైఖరి వల్ల అవి ఫలించ లేదు. గాజా నుండి అంటే అన్ని నగరాలు, పట్టణాల నుండి పూర్తిగా ఇజ్రాయిల్ బలగాలు వైదొలగేందుకు, శాశ్వత కాల్పుల విరమణకు దారి తీసేలా ఈ ఒప్పందం వుండాలని హమాస్ భావిస్తోందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని హమాస్ అధికారి ఒకరు చెప్పారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా నిర్వాసితులైన గాజా ప్రజలను తిరిగి స్వస్థలాకు వచ్చేందుకు అనుమతించాలని కోరుతున్నారు. అలాగే ఒక బందీని విడుదల చేస్తే 20 నుండి 50మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని పేర్కొన్నారు. గతంలో 100–1 నిష్పత్తిగా ప్రతిపాదించిన దాన్ని ఇప్పుడు కుదించారు. కొత్త ప్రతిపాదన ప్రకారం, తొలుత మహిళలు, పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని విడుదల చేయాలని సదరు అధికారి తెలిపారు. అలాగే మానవతా సాయాన్ని కూడా పెంచాలని కోరారు. గతేడాది అక్టోబరు 7న దాడి సందర్భంగా దాదాపు 250మంది ఇజ్రాయిలీ, విదేశీ బందీలను పట్టుకోగా, వారిలో చాలామందిని నవంబరులో వారం రోజులు పాటు అమలైన కాల్పుల విరమణ ఒప్పందం సందర్భంగా విడుదల చేశారు. ఈజిప్ట్, కతార్, అమెరికాలు దీన్ని అమలు చేసే బాధ్యత తీసుకోవాలని అన్నారు.

ఇదిలావుండగా, గత 24 గంటల్లో 149మంది పాలస్తీనియన్లు మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. రంజాన్ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా నిన్న అల్ అక్సా మసీదులో వేలాదిమంది ప్రార్ధనలు జరిపారు. ఇజ్రాయిల్ బలగాలు భారీగా మోహరించిన వున్నా, ఆంక్షలు అమల్లో వున్నా ప్రజలు ప్రార్ధనలకు హాజరయ్యారు.

రఫాపై బాంబు దాడులకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు పన్నాగం పనానరు. ఆ పన్నాగాన్ని నెరవేర్చే పనిలో ఇజ్రాయిలీ దళాలు ఉన్నాయి.. నెతన్యాహు ఆమోదించిన ప్రణాళికను తాము చూడలేదని అమెరికా తెలిపింది.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేది వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 6,23,092 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలు ఉన్నారు. వీరితో పాటు గతేడాది ఫెయిలైన 1,02,058 మంది విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 3473 పరీక్ష కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబందించిన ఏర్పాట్లను పాఠశాల విద్యాశాఖ పూర్తిచేసింది.

మహారాజశ్రీ **A.P ENDOWMENT TRIBUNAL AMARAVATHI AT PEDAKAKANI** వారి కోర్టులో
IA.No.31/2024 & I A.No.32/2024
In OA No. 600/2017

Between
1. The Assistant Commissioner, Endowments Department Vijayawada.
2. Sri Ramalingeswara swamy Temple Nandigama N.T.R District. Rep by the Executive officer ...petitioners

Versus

Kumari Sankaramanchi Parvathi & 4 Others ...respondents.
1.Kumari Shankaramanchi Parvathi, D/o late Purushottam, Hindu, aged above 64 years, R/o Tadankivari Street, Satyanarayanapuram Vijayawada- 520011
2: Unnam Vasu S/o Ramaiah,Hindu, aged above 36 years, R/o 2 nd lane Raithupeta Nandigama Town & Mandal N.T.R district
5 : Murapaka Appanna S/o Akkulu Hindu, aged 41 years, R/o chinaveedi Mandava kuriti Srikakulam, Srikakulam District.

పై నంబరు దావాలో రెస్పాండెంట్ R1 , R2 & R5 హాజరు నిమిత్తం పై కోర్టు వారు ది. 25-3-2024 వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున పై రెస్పాండెంట్స్ పైన తెలిపిన కోర్టుకి ది 25-3-2024 ఉదయం గం .11.00 లకు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరయి తమ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిపక్షంలో మీ పరోక్షం కోర్టు వారు తీర్మానించేదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ :25-3-2024

Veerla Srinivasa Rao, B.Sc., LL.M.,
Standing Counsel for AP Endowments
Tribunal Zone II, Krishna District.
D.No. 61-15-6A, VMR Road,
Ramalingeswara Nagar, Vijayawada-13.
Ph : 9849220213, 9182981968

సామాజిక భద్రత కల్పిస్తాం : రాహుల్

న్యూఢిల్లీ : దేశ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. శనివారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోషల్ మీడియా ఎక్స్‌లో కార్మికుల కోసం 5 పాయింట్ల తీర్మానాన్ని విడుదల చేశారు. కార్మికుల ఆరోగ్య హక్కుల చట్టం తీసుకొచ్చి, ఉచిత వైద్య పరీక్షలు, మందులు, చికిత్స అందిస్తామన్నారు. కార్మిక గౌరవ చట్టం ద్వారా కార్మికులకు కనీసం రూ.400 రోజువారీ వేతనం ఇస్తారు. ఉపాధి హామీ కార్మికులను ఈ పథకంలో చేర్చుతారు. శ్రమ సమ్మాన్ పథకం ప్రకారం, కాంగ్రెస్ కార్మికులకు నెలకు కనీసం రూ.12,000 హామీ ఇచ్చింది. అర్బన్ ఇన్ కమ్ గ్యారెంటీ యాక్ట్ తీసుకొస్తామని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమా ప్రవేశపెడతామన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలపై సమీక్ష జరుగుతుందని ఐదో హామీగా రాహుల్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో మే13న

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న 46,165 పోలింగ్ స్టేషన్లలో, 12,045 స్టేషన్లు పట్టణాల పరిధిలో ఉండగా మిగిలిన 34,120 పోలింగ్ కేంద్రాలు రూరల్ ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు మరో 219 స్టేషన్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. మొత్తం 1,15,416 (120 శాతం) ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం), 1,43,037 బ్యాలెట్ యూనిట్స్, 1,37,190 వివిప్యాట్స్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికలకు అయిదు రోజుల ముందు ఓటర్లకు స్లిప్పులు జారీచేస్తామని వివరించారు.

ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే...

రానున్న ఎన్నికల్లో కేవలం ప్రభుత్వ, రెగ్యులర్ ఉద్యోగుల సేవలను మాత్రమే వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎటువంటి పరిస్థితుల్లోనూ వినియోగించుకోమని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది కూడా ప్రభుత్వ ఉద్యోగుల కిందకే వస్తారని, వారి సేవలను కూడా ఎన్నికల కోసం వినియోగించుకుంటున్నామని చెప్పారు. అయితే ఎన్నికల నిర్వహణలో ప్రధాన బాధ్యతలైన ఓటర్ల వెరిఫికేషన్, బటన్ ప్రెస్సింగ్ విధులు వారికి అప్పగించేది లేదని, ఓటర్లకు ఇంకు పూసేందుకు మాత్రమే వినియోగించుకుంటాని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వారికి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఎన్నికల్లోనూ టీచర్లే ప్రధాన బాధ్యత వహిస్తారని, ఎన్నికల నిర్వహణలో 60 శాతం మంది టీచర్లే ఉంటారని తెలిపారు. అస్సలు టీచర్లు లేకపోతే ఎన్నికలే లేవని ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వాలంటీర్ల సేవలను ఏ రూపంలోనూ ఎన్నికల విధుల కోసం వినియోగించుకోబోమని ఆయన తెలిపారు

మోగిన ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతాయుతమైన సోషల్ మీడియా ప్రవర్తనను కలిగి ఉండాలని, నకిలీ వార్తల మూలకారకులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు 96.8 కోట్లు
పురుషులు 49.7 కోట్లు
మహిళలు 47.1 కోట్లు
ట్రాన్స్ జండర్స్ 48,044

18–19 ఏళ్ల తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువత 1.85 కోట్లు.
20–29 మధ్య వయసు గల ఓటర్లు 19.74 కోట్లు
85 ఏళ్లపైబడిన వృద్ధులు 81,87,9999 మంది
వందేళ్లు పైబడిన వృద్ధులు 2,18,442 మంది
వికలాంగులు 88,35,449 మంది.
అందులో 52,65,076 మంది పురుషులు, 35,69,933 మంది మహిళలు, 440 ట్రాన్స్ జండర్స్.

ఇవిఎంలు : 55 లక్షలు
పోలింగ్ కేంద్రాలు : 10.5 లక్షలు
పోలింగ్ అధికారులు, భద్రతా సిబ్బంది : 1.5 కోట్లు

ప్రస్తుత లోక్‌సభ పదవీకాల పరిమితి 2024 జూన్16తో ముగియనుండగా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కాలపరిమితి జూన్ 11తో ముగుస్తుంది. ఈ లోక్‌సభ ఎన్నికలతో బాటే దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో 26 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ

దశ	నోటిఫికేషన్	నామినేషన్ల	నామినేషన్ల గడువు	ఉపసంహరణ పరిశీలన	పోలింగ్
ఒకటి	మార్చి 20	మార్చి 27	మార్చి 28	మార్చి 30	ఏప్రిల్ 19
రెండు	మార్చి 28	ఏప్రిల్ 4	ఏప్రిల్ 5	ఏప్రిల్ 8	ఏప్రిల్ 26
మూడో	ఏప్రిల్ 12	ఏప్రిల్ 19	ఏప్రిల్ 20	ఏప్రిల్ 22	మే 7
నాలుగు	ఏప్రిల్ 18	ఏప్రిల్ 25	ఏప్రిల్ 26	ఏప్రిల్ 29	మే 13
ఐదు	ఏప్రిల్ 26	మే 3	మే 4	మే 6	మే 20
ఆరు	ఏప్రిల్ 29	మే 6	మే 7	మే 9	మే 25
ఏడు	మే 7	మే 14	మే 15	మే 17	జూన్ 1

సముద్రపు దొంగల యత్నాలు భగ్నం

- భారత యుద్ధనౌక సాహసం

న్యూఢిల్లీ : గత డిసెంబరులో హైజాక్ చేసిన ఓడ రూయిన్‌ను ఉపయోగించి సోమాలీ సముద్రపు దొంగలు చేస్తున్న దాడుల యత్నాలను భారత నావికాదళానికి చెందిన యుద్ధ నౌక భగ్నం చేసింది. సోమాలియా తూర్పు తీరంలో నట్టనడి సముద్రంలో ఓడలను హైజాక్ చేసేందుకు పాల్పడుతున్న సముద్రపు దొంగల గ్రూపు యత్నాలను ఓడించామని తెలిపింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా తాము తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకించిన వారు భారత యుద్ధనౌకపై కాల్పులు జరిపారని నేవీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆత్మరక్షణార్ధం తాము కూడా ఎదురు చర్యలు తీసుకుని వారిని లొంగదీశామని తెలిపింది. నౌకలోని సముద్రపు దొంగలను వెంటనే లొంగిపోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని తెలిపింది. డిసెంబరు 14న మాల్టా పతాకంతో వున్న ట్యాంకర్ నుండి కాపాడాల్సిందిగా ఎస్ఓఎస్ సందేశం భారత నేవీకి అందింది. దాంట్లో 18మంది సిబ్బంది కూడా వున్నారు. ఆ తర్వాత నుండి ఆ నౌకను సముద్రపు దొంగలు తమ చౌర్య కార్యకలాపాలకు వాడుతున్నట్లు తెలుస్తోందని నేవీ తెలిపింది.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
సికింద్రాబాద్ శాఖ, డో.నం.1-2-73/2, సిటిసి పార్క్ లేన్ ఎదురు, సికింద్రాబాద్, టెలి : 040-23465131,132

స్వాధీనత నోటీసు

(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))

ఏదైతే, దిగువసంతకందారు అయిన **బ్యాంక్ ఆఫ్ బరోడా** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించిన అధికారాలను అధ్యాయనం చేస్తూ **తేది : 28.12.2023న డిమాండ్ నోటీసును** జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత **మెసెర్స్. లిఖిత్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ.కృష్ణారెడ్డి జి., శ్రీ.జి.దినేష్ రెడ్డి మరియు హామీదారులు శ్రీ.హరీఫ్ రెడ్డి జి., శ్రీమతి. జి.సుశీల్, శ్రీ.కృష్ణారెడ్డి జి., శ్రీ.దినేష్ రెడ్డి జి., శ్రీ.పరమేష్ రెడ్డి జి.,** నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి ఉన్న **రూ.4,03,36,326.32/– (నాలుగు కోట్ల మూడు లక్షల ముప్పై ఆరు వేల మూడు వందల ఇరవై ఆరు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే)** 26.07.2023 తర్వాత దానిపై తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర ఖర్చులు సదరు నోటీసు రసీదు తేది నుండి 60రోజులలోగా చెల్లించమని కోరడమైనది. డైరెక్టర్లు/హామీదారులు/తనఖాదారులు. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు క్రింద వివరించిన ఆస్తిని 15 మార్చి, 2024న లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు.

డైరెక్టర్లు మరియు హామీదారులు మరియు ప్రత్యేకించి సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తులతో ఎలాంటి లావాదేవీలు జరపరాదని మరియు సదరు ఆస్తులకు సంబంధించి ఎలాంటి లావాదేవీలైన మొత్తం రూ.**4,03,36,326.32/– (నాలుగు కోట్ల మూడు లక్షల ముప్పై ఆరు వేల మూడు వందల ఇరవై ఆరు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే)** + 26.07.2023 తర్వాత దానిపై తదుపరి వడ్డీ మరియు దానిపై ఇరత ఖర్చులు **బ్యాంక్ ఆఫ్ బరోడా,** సికింద్రాబాద్ శాఖకు చెల్లించి జరుపవలెను.

రుణగ్రహీతలు జాగ్రత్త ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (8) యొక్క నిబంధనలు అహ్వానించడమైనది.

ఆస్తి షెడ్యూల్ : గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, ప్రస్తుత కొరిటేపాడు ఉపజిల్లా, గోరంట్ల గ్రామ పంచాయతీ ఏరియా ప్రస్తుత గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా గోరంట్ల గ్రామం వద్ద శ్రీ.గోలమరి వెంకట రెడ్డి మరియు శ్రీమతి. గొలమరి సుశీల రెడ్డి పేరుతో ఉన్న డో.నం.11/ఎఫ్ విస్తీర్ణం ఎసి. 0–69 సెంట్లు. మరియు తేది : 22.12.2012న వైడ్ డాక్యుమెంట్స్ నం.752/2013 కొరిటేపాడు సబ్ రిజిస్ట్రార్ గుంటూరు. **ఉత్తరం :** శ్రీ.గొలమరి పరమేశ్వరరెడ్డి, శ్రీ.గొలమరి వెంకట రెడ్డి మరియు ఇతరులకు చెందిన స్థలం, **దక్షిణం :** చలువాది సాంబశివరావు మరియు ఇతరులకు చెందిన స్థలం, **తూర్పు :** కొమ్మినేని సాంబశివరావు మరియు ఇతరులకు చెందిన స్థలం, **పడమర :** శ్రీ.గొలమరి పరమేశ్వ రెడ్డి, శ్రీ.గోలమరి వెంకట రెడ్డికి చెందిన స్థలం.

తేది: 15.03.2024
ప్రదేశం: గుంటూరు

సం/– అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

మీ కోసం

ఎక్కువ ప్రమాణంలో వెల్లుల్లిపాయల పొట్టు తీయాల్సి వచ్చినపుడు వాటిని ఐదునిమిషాలు గోరువెచ్చని నీటిలో నానబెట్టి తర్వాత పొడి బట్టతో తుడిస్తే పొట్టు సులభంగా వచ్చేస్తుంది.

జీవన సౌరభం

మనిషి స్థాయిని నిర్ణయించేంది అతని ప్రవర్తనే.. పొగడ్త కాదు..

ఎవరి ముఖం ఎవరు చూశారు?



వేకువనే కుమార్తెను చూడటానికి గోరంట్ల గ్రామం బయలుదేరింది భానుమతమ్మ. గుమ్మం తాళం వేసి వీధి లోనికి రాగానే, వ్యాపారి శివయ్య తల్లి వాళ్ళ ఇంటి ముందు ముగ్గు పెడుతూ కనిపించింది. 'భానుమతమ్మ, వేకువనే బయలు దేరావు ఎక్కడికో?' అన్నది శివయ్య తల్లి సుబ్బమ్మ. 'అమ్మాయిని చూసి వద్దమని వెళుతున్నా అని' చెప్పి బస్ స్టాండ్ వైపు అడుగులు వేసింది భానుమతమ్మ.

మరుదినం సాయంత్రం తను ఇల్లు చేరేసరికి, ఒక వ్యక్తి వచ్చి 'అమ్మా మిమ్మల్ని వెంటనే రచ్చబండ దగ్గరకు రమ్మన్నారు ఊరి పెద్దలు' అన్నాడు. అతన్ని అనుసరించి రచ్చబండ వద్దకు వెళ్ళింది భానుమతమ్మ.

రచ్చబండ వద్ద సమావేశమైన ఊరి పెద్ద 'భానుమతమ్మ, నిన్న వేకువన నీ ముఖం చూసిన సుబ్బమ్మ గారు స్నానాల గదిలో పడి చేయి విరగొట్టుకున్నారట. తన చేయి విరగటానికి కారణం నువ్వేనని పొద్దున్నే నీ ముఖం చూడటం వలన ఇలా జరిగిందనీ ఆవిడ ఆరోపిస్తున్నారు. దీనికి నీ సమాధానం ఏమిటి?' అన్నాడు ఊరిపెద్ద.

'అయ్యా సుబ్బమ్మ గారు మాత్రమే కాదు. ఆమె, నన్ను.. నేను, ఆవిడను పొద్దున్నే ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం. నా ముఖం చూడటం వలన ఆమెకు చేయి విరిగింది. పదిరోజులు వైద్యంతో బాగుపడుతుంది. మరి ఆమె ముఖం చూసిన నాకు పెద్ద నష్టమే జరిగింది. బస్‌లో ఎవడో నా పర్సు కొట్టేసాడు. నాకు జరిగిన నష్టం ఎవరికి చెప్పుకోవాలి?' అన్నది భానుమతమ్మ.

ఇరువురి వాదనలు విన్న ఊరి పెద్ద 'ఈ సంఘటనలు కేవలం మీ ఇరువురి అజాగ్రత్త వలనే జరిగాయి. ఇందులో శకునం, ముహుర్తం, పొద్దున్నే ముఖం చూడటం వంటి వాటికి తావు లేదు. మూఢనమ్మకాలతో ఎదటివారిని నిందించడం తప్పు. పెద్ద వారైన మీకు ఈ విషయాలు తెలియనివి కావు. ఇటువంటి వాటి జోలికి వెళ్లకుండా ఇప్పటి నుండైనా జాగ్రత్తగా ఉండండి' అని హితవు పలికాడు.

- బెల్లంకొండ నాగేశ్వరరావు, చెన్నయ్.

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ గజిబిజిగా ఇచ్చిన అక్షరాలను క్రమ పద్ధతిలో రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి.

తకంటా ----	క్తిజాశప్ర ---
టకంకం ----	నవజీ ----
హాముదే ---	శంసందే ---
కాంపుంతిజం ----	రిచిన్నా ---
బసింలంగి ----	వియంష ---

నేను గీసిన బొమ్మ

ఆరిపాక త్రివిక్రమ్,
5వ తరగతి,
ఎంపిపిఎస్, గొంపవానిపాలెం,
కె.కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మరిన్ని విజయాల దిశగా సమంత..

ఈతరం కథానాయికల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నటి సమంత. తన పేరు చెబితే అందం, అభినయం కంటే ముందు ఆమె నిండైన ఆత్మవిశ్వాసమే మనకు కనపడుతుంది. జీవితంలో ఎదురైన ప్రతి ఎదురుదెబ్బను కొండంత ధైర్యంతో ఎదుర్కొన్న ధీరగా అభిమానులు ఆమెని అభినందిస్తారు. వివాహ జీవితం నుంచి విడిపోవాల్సి వచ్చినా, అనారోగ్య కారణంగా శారీరకంగా కుంగిపోయినా సమంత ఎప్పుడూ నిరుత్సాహ పడలేదు. 'ధైర్యం కోల్పోనని.. ప్రతి సవాల్‌ని స్వీకరించి పోరాడతాన'ని ఎన్నో సందర్భాల్లో చెప్పారు. రెండు సంవత్సరాల విరామం తరువాత మళ్లీ తెరపై సందడి చేయడానికి సిద్ధమైన ఆమె తాజాగా తన అంతరంగాన్ని మరోసారి ఆవిష్కరించారు.

'నాది ఓ బుజ్జి కుక్కపిల్ల మనస్తత్వం. ఎప్పుడూ భయం నిండిన మనసుతో ఉండేదాన్ని. దీర్ఘకాలం అదే కొనసాగించాను. ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడడం నా అలవాటు. నాకు లభించిన సౌకర్యాలు చాలా పరిమితంగా ఉండేవి. వైఫల్యం చెందుతానేమోనన్న భయం చాలా కాలం వెంటాడింది. నేను ఏం సాధించానో.. ప్రేమ నిండిన ప్రదేశం నా చుట్టూ ఉందో లేదో నాకు తెలిసేది కాదు.

ఈ అయోమయ స్థితి నుండి ఈ మధ్యే నన్ను నేను మార్చుకున్నాను. నా ఆరోగ్యం క్షీణించినప్పుడు నా భయమే నాకు ప్రేరణగా నిలిచింది. అది నన్ను ఒకపక్క కుంగదీస్తున్నా జీవితం విసిరిన సవాలుని స్వీకరించమని నాకు ధైర్యం చెప్పింది. నేను ఎప్పుడూ అనుకునేదాన్ని.. నేనే ఎందుకు అని? రెండు సంవత్సరాలు కఠినంగా గడిపాను. నా ముందు వేరే మార్గం లేదు.

ఈ పరిస్థితులు నాకు తీరిక లేని సమయాన్ని గడిపేలా చేశాయి. రోజుకు 10 రకాల పనులు చేసేదాన్ని. ఐదు గంటలు నిద్ర పోయేదాన్ని. నేనొక ఉత్పాదకాన్ని అని ఎప్పుడూ అనుకునేదాన్ని. అందుకే నా శరీరానికి, మనస్సుకు ఎప్పుడూ విరామం ఇచ్చేదాన్ని కాదు. ఈ రకమైన ఆలోచనలతో ఎప్పుడూ సతమతమయ్యేదాన్ని. నిద్రలేచేసరికి ఎక్కడ ఈ ఆలోచనలు నా నుండి దూరమౌతాయోమోనని భయపడేదాన్ని. అంతలా కష్టపడేదాన్ని. 14 సంవత్సరాలు ఇలాగే పనిచేశాను. ఈ ప్రయాణంలో నాకు వచ్చిన విజయాన్ని కూడా ఆస్వాదించలేదు. అది ఇతరుల వల్ల వచ్చిందన్న భ్రమలో ఉండేదాన్ని. నేను సాధించానని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడిప్పుడే నన్ను నేను నమ్మడం మొదలుపెట్టాను. ఈ భావన నేను ఏదో సాధించానన్న నమ్మకాన్ని ఇస్తోంది.



అనారోగ్యం గురించి ఎందుకు చెప్పానంటే..

నా చుట్టూ ఏర్పడిన ఇబ్బందికర పరిస్థితుల వల్లే నా అనారోగ్యం గురించి బయటికి చెప్పాల్సివచ్చింది. మొట్టమొదటిసారి ఫీమేల్ ఓరియంటేడ్ చిత్రాన్ని చేశాను. ఆ సమయంలోనే అనారోగ్యం గురించి తెలిసింది. చాలా నీరసించి పోయాను. దేనికీ సిద్ధంగా లేను. ఈ పరిస్థితుల్లో కొందరు నా చుట్టూ ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించారు. తప్పుడు ప్రచారాలు చేశారు. దీంతో ఆ చిత్ర నిర్మాతలు నన్ను ప్రమోషన్స్ చేయమని బలవంతం చేశారు. చేయకపోతే ఆ సినిమా ఆడదని, చచ్చిపోతుందని ప్రాధేయపడ్డారు. చివరికి ఇంటర్వ్యూ ఇవ్వడానికి ఒప్పుకున్నాను. కానీ ఆరోజు అలా మాట్లాడానికి కూడా అధిక మోతాదులో చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. అలా నేను బయటికి రాలేని కారణాన్ని బలవంతంగా చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. నాకు మరో అవకాశం లేదు. కానీ ఇంత చేసినా నేను సానుభూతి కోసం చేశానని ప్రచారం జరిగింది.

నటిగా, మనిషిగా ఎంతో అభివృద్ధి చెందాను. నా కెరియర్ తొలినాళ్లల్లో నా గురించి ఎవరేం రాశారో అని ఆతృతగా ఎదురుచూసేదాన్ని. నాపై వచ్చిన ఆర్టికల్స్ ఆసక్తిగా చదివేదాన్ని. అయితే రాను రాను నా చుట్టూ ప్రశ్నించేవారు ఎక్కువయ్యారు. వాళ్లడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం మానేసి, తిరిగి ప్రశ్నించడం నేర్చుకున్నాను. ఆ పరిస్థితులు, ఆ వ్యక్తులే నన్ను నేను శక్తివంతంగా తీర్చుదిద్దుకునేలా చేసినట్టు లెక్క. ఎవరైనా బాధలో, ఒత్తిడిలో ఉన్నప్పుడు దాన్ని వ్యక్తపరిచే సమగ్ర వేదిక ఉండాలి. సోషల్‌మీడియా ఫ్లాట్ ఫామ్ ద్వారా నాకు అది దొరికిందని భావిస్తాను.

విభిన్న పాత్రలు చేశాను

పుష్ప చిత్రంలో 'ఊ అంటావా మావ' ప్రత్యేక గీతం చేసినప్పుడే నేను నటించిన 'ఫ్యామిలీ మ్యాన్' విడుదలైంది. ప్రత్యేక గీతంలో చేయడమనేది నన్ను నేను నిరూపించుకోవాలని చేసిన ప్రయోగం. కాబట్టి ఎవరి అనుమతీ తీసుకోలేదు. అందంగా లేనని, ఆత్మవిశ్వాసం తక్కువని, నా లైంగికతను ద్వేషిస్తూ గడిపే నేను తీసుకున్న అతి పెద్ద నిర్ణయం అది.



నటిగా ఎదిగే క్రమంలో ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నాను. వాటిని అధిగమించడానికి పోరాడాను. నా అంతరంగంలో ఎదురయ్యే ఎన్నో ప్రతికూలతలను సంహరిస్తూ ముందుకు వెళ్లాను. ఇంత విషమ పరిస్థితుల్లో కూడా ఎలా నవ్వుతున్నారని చాలామంది ప్రశ్నించేవారు. పరిస్థితులతో పోరాడుతూ ఎలా ఉంటానో వాళ్లకి చూపించాలనుకున్నాను. అదే చేశాను' అంటున్న నవతరం కథానాయిక సమంత ఎంతోమంది శక్తివంత మహిళలకు నిలువెత్తు రూపం.

రంగుల ప్రపంచంలో ఎందరో కథానాయికలు మనకు తారసపడతారు. కానీ చిన్న వయసులో, కెరీర్ పుంజుకుంటున్న సమయంలో సమంతకు ఎదురైన ఒడిదుడుకులు ఎన్నో.. వాటన్నింటినీ అధిగమించి తనను తాను నిరూపించుకుంటున్న సమంత నటించిన 'సిటాడిల్' తెలుగు సిరీస్ ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది.

అనారోగ్యం నుండి కోలుకున్న సమంత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో తన గత జీవితపు జ్ఞాపకాలను పదే పదే గుర్తుకు తెచ్చుకుంటూ పడి లేచిన కెరటం వలె శక్తిని కూడదీసుకుంటున్నారు. భవిష్యత్తులో సమంత మళ్లీ వెండితెరపై ఎన్నో పాత్రలు చేయాలని మనసారా కోరుకుందాం.

సోనూసూద్ 'ఫతేహ్' టీజర్ విడుదల

సోనూసూద్ దర్శకుడిగా, హీరోగా తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫతేహ్'. తాజాగా చిత్ర బృందం ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో జాక్వెలిన్ ఫెర్నాండేజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాని రిలీజ్‌కి తీసుకొస్తున్నట్టుగా చిత్రబృందం స్పష్టం చేసింది. జీ స్టూడియోస్, సోనాలి సూద్‌లు సంయుక్తంగా ఈ చిత్ర నిర్మాణం వహిస్తున్నారు.

నేను బాగానే ఉన్నాను..

అమితాబ్ బచ్చన్ ఆరోగ్యంపై వస్తున్న వార్తలపై తాజాగా ఆయన స్పందించారు. అనారోగ్య కారణంగా శుక్రవారం అమితాబ్ ముంబై కోకిలబెన్ ఆస్పత్రిలో చేరారని, ఆయనకు వైద్యులు యాంజియోప్లాస్టీ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే, తన ఆరోగ్యంపై వస్తోన్న వార్తలలో ఎటువంటి నిజమూ లేదనీ అమితాబ్ స్పష్టం చేశారు. 'ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్స్'కు హాజరైన ఆయన్ని అక్కడ మీడియా ప్రతినిధులు ఆరోగ్యం ఎలా ఉందని అడగడంతో.. 'నేను బాగానే ఉన్నాను. నా అనారోగ్యంపై వచ్చినవన్నీ తప్పుడు వార్తలు..'' అని సమాధానం ఇచ్చారు. ప్రీమియర్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న అమితాబ్ చాలా హుషారుగా కనిపించారు.

'ఫ్యామిలీ స్టార్' పూర్తి చేశారు

విజయ్ దేవరకొండ హీరోగా, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా పరశురామ్ పెట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి గోపి సుందర్ సంగీతం అందిస్తున్నారు. శనివారంతో తమ మూవీ షూట్ మొత్తం పూర్తి అయిందని హీరో విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ప్రకటించారు. తెలుగు, తమిళ భాషల్లో ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది.

'ఓం భీమ్ బుష్' థియేట్రికల్ ట్రైలర్ విడుదల

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధానపాత్రల్లో శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. వి సెల్యూలాయిడ్, సునీల్ బలుసు కలిసి ఈ సినిమాను నిర్మించారు. యువి క్రియేషన్స్ సమర్పణలో ఈ నెల 22న ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే టీజర్, ఫస్ట్ సింగిల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. శనివారం నాడు థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. ప్రీతి ముకుందన్, ఆయేషాఖాన్ హీరోయిన్లుగా, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్, రచ్చ రవి తదితరులు నటిస్తున్నారు. హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ ఈ సినిమా ఆడిన థియేటర్లు ప్రేక్షకుల నవ్వులతో మార్మోగుతాయని అన్నారు.

మే 17న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'

విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. ఈ చిత్రానికి కృష్ణ చైతన్య రచన, దర్శకత్వం వహిస్తున్నారు. నేహ శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంస్థలపై సాయి సౌజన్య, సూర్యదేవర నాగవంశీ ఈ మూవీని నిర్మిస్తున్నారు. మార్చి 8న రిలీజ్ కావాల్సిన ఈ మూవీ రిలీజ్ డేట్ వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా శనివారం మే 17న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం ప్రేక్షకుల ముందుకి రానుందని చిత్రబృందం ఒక పోస్టర్ ద్వారా ప్రకటించారు.

హీరోగా లోకేష్ కనకరాజ్ ఎంట్రీ



తమిళ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఓ మ్యూజికల్ ఆల్బమ్‌లో నటిస్తున్నారు. ఈ ఆల్బమ్‌ను కమల్‌హాసన్ రూపొందించటంతోపాటుగా ఓ పాటను కూడా రాశారు. ఈ పాటను శ్రుతిహాసన్ పాడటంతోపాటు సంగీతాన్ని అందించారు. ఈ ఆల్బమ్‌కు 'ఇనిమేల్' అనే టైటిల్‌ను కూడా నిర్ణయించారు. ద్వారకేశ్ ప్రభాకర్ దర్శకత్వం వహించారు. భువన్‌గౌడ ఛాయాగ్రహణం అందించారు. ఆల్బమ్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లుగా ప్రతినిధులు తెలిపారు. శ్రుతిహాసన్ గతంలో ఎడ్జ్, షీస్ ఎ హీరో, మాస్టర్ మోషన్ పేర్లతో మ్యూజికల్ ఆల్బమ్స్ రూపొందించారు.

డబ్ల్యుపిఎల్ టైటిల్ విజేత ఎవరో..?

- ఫైనల్‌కు తొలిసారి బెంగళూరు
- రాత్రి 7.30గం॥ల నుంచి

టైటిల్‌తో ఢిల్లీ-బెంగళూరు జట్ల కెప్టెన్లు

న్యూఢిల్లీ : మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్-2 టైటిల్ విజేత ఎవరో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. బెంగళూరు జట్టు తొలిసారి ఫైనల్‌కు చేరగా.. ఢిల్లీ జట్టు వరుసగా రెండో ఏడాది ఫైనల్‌కు చేరింది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయిని చిత్తుచేసి బెంగళూరు తొలిసారి ఫైనల్‌కు చేరుకోగా.. మరోవైపు ఢిల్లీ జట్టు లీగ్ దశలో ఎనిమిది మ్యాచుల్లో ఏకంగా ఆరు మ్యాచుల్లో గెలిచి నేరుగా ఫైనల్‌కు చేరింది. బెంగళూరు జట్టుకు స్మృతి మంధాన, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు మెగ్ లానింగ్ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు. గత సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు దూరమైన మంధాన టీమ్ ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసి టాప్-3లో నిలిచి ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఒత్తిడిని జయించి టైటిల్‌ను చేజిక్కించుకోవడంలో బెంగళూరు జట్టు కొంత వెనుకబడి ఉంది. ఎందుకంటే బెంగళూరు పురుషుల జట్టు ఐపిఎల్‌లో మూడుసార్లు ఫైనల్‌కు చేరి బోల్తా పడింది. ఈ క్రమంలో తొలిసారి టైటిల్ గెలిచిన కెప్టెన్‌గా నిలవాలని స్మృతి మంధాన ఆశిస్తున్నా.. ఆ జట్టుకు ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. 2008 తొలి సీజన్ నుంచి బెంగళూరు జట్టు ఫేవరేట్. ఆర్సీబీ జట్టు ఇప్పటివరకు మూడుసార్లు ఫైనల్‌కు చేరినా.. ఒక్కసారి కూడా టైటిల్‌ను చేజిక్కించుకోలేక పోయింది. ఒత్తిడిని తట్టుకోలేక ప్రత్యర్థికి ట్రోఫీని అప్పగించేసింది. ఆ నానుడి నుంచి చెరిపేసి తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకోవాలని మహిళల జట్టు చూస్తోంది. పురుషుల మహిళల ఫ్రాంచైజీల యజమానులు కావడంతో ట్రోఫీని సాధించాలని కాంక్షలో బెంగళూరు జట్టు ఉంది.

మంధానకు భలే చాన్స్

తొలి సీజన్‌లో నిరాశపరిచిన ఆర్సీబీ రెండో సీజన్‌లో అదరగొట్టింది. కెప్టెన్ మంధాన, ఆల్‌రౌండర్లు ఎలీసా పెర్రీ, శ్రేయాంక పాటిల్, వరేహమ్‌లతో పాటు రీచా ఘోష్ రాణించడంతో ప్లే ఆఫ్స్ చేరింది. ఎలిమినేటర్ పోరులో పెర్రీ ఖతర్నాక్ హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకోగా.. శ్రేయాంక తన మ్యాజిక్ స్పెల్‌తో ముంబైని కట్టడి చేసింది. తొలిసారి ఫైనల్ చేరిన మంధాన సేన చరిత్రకు అడుగుదూరంలో నిలిచింది. అయితే.. ఫైనల్లో ఆర్సీబీకి ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి గట్టి పోటీ ఎదురవ్వనుంది. నిరుడు రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఢిల్లీ.. ఈసారి ట్రోఫీ వదలొద్దనే కసితో ఉంది. ఆర్సీబీ కప్పు కొట్టాలంటే ఢిల్లీ ఓపెనర్లు మేగ్ లానింగ్, షఫాలీ వర్మతో పాటు ఫామ్‌లో ఉన్న అలిసే క్యాప్సేల దూకుడుకు బ్రేక్ వేయాలి.

ఇక ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల విషయానికొస్తే.. మహిళల ప్రీమియర్ లీగ్ 2024 చివరి దశకు చేరుకుంది. ఈసారి %ఫైనా% ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి.

జట్లు(అంచనా)...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: మంధాన (కెప్టెన్), మేఘన, ఇంద్రాణి, రిచా ఘోష్, దిశా కసత్, శుభా సతీష్, సిమ్రాన్ బదూర్, నాడిన్ డి క్లెర్క్, సోఫీ డివైన్, రాంకా పాటిల్, ఎల్లిస్ పెర్రీ, ఏక్తా బిష్త్, కేట్ క్రాస్, సోఫీ మోలిద్దా పోకర్కర్, రేణుకా ఠాకూర్ సింగ్, జార్జియా, ఆశా శోభనా.

ఢిల్లీ క్యాపిటల్స్: లానింగ్ (కెప్టెన్), తానియా భాటియా, రోడ్రిగ్జ్, షఫాలీ, ఎలిస్ క్యాప్స్, మరిజన్ కప్, శిఖా పాండే, సదర్లాండ్, జాన్సన్, మిన్ను మణి, పూనమ్, అరుంధతి, టిటాస్ సాధు, రాధా యాదవ్, అశ్విని, అపర్ణ మోండల్, స్నేహ దీప్తి.

భారత్‌లోనే ఐపిఎల్ మ్యాచ్‌లన్నీ..

- త్వరలో పూర్తి షెడ్యూల్ : బిసిసిఐ కార్యదర్శి జే షా

ముంబయి: ఈ ఏడాది జరిగే ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17 మ్యాచ్‌లన్నీ స్వదేశంలోనే నిర్వహిస్తామని బిసిసిఐ కార్యదర్శి జే షా శనివారం స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో జే షా ఈ ప్రకటన చేశారు. రెండో అర్ధ భాగం మ్యాచ్‌లను యుఇఎలో నిర్వహించనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో జే షా తాజాగా స్పందించారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 7వరకు జరిగే ఐపిఎల్ తొలి సీజన్ మ్యాచ్‌లను మాత్రమే విడుదల చేశామని, అందులో మొత్తం 21 మ్యాచ్‌లు జరగనున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో త్వరలో మిగిలిన మ్యాచ్‌ల షెడ్యూల్‌తో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. యుఏఇ, ఇతర వేదికల్లో ఐపిఎల్‌ను నిర్వహించే ప్రసక్తి లేదన్నారు. ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో చెన్నైసూపర్ కింగ్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానున్నాయని, లీగ్ ప్రారంభమయ్యాక మొదటి వారంతంలో డబుల్ హెడర్ మ్యాచ్‌ల్లో పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతానైట్ రైడర్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నట్లు ఆయన తెలిపారు.

సెమీస్‌లో ఓడిన లక్ష్యసేన్

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముగిసిన భారత షట్లర్ల పోరు

లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరు ముగిసింది. సెమీస్‌కు చేరిన ఏకైక షట్లర్ లక్ష్యసేన్ 9వ ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ చేతిలో పోరాడి ఓడాడు. మూడుసెట్ల హోరాహోరీ పోరులో లక్ష్యసేన్ 12-21, 21-10, 15-21తో ఓటమిపాలయ్యాడు. తొలి గేమ్‌ను ఓడిన లక్ష్యసేన్.. రెండో గేమ్‌లో పుంజుకొని చేజిక్కించుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఓ దశలో 6-3పాయింట్లతో ఆధిక్యతలో నిలిచినా.. బలమైన ప్రత్యర్థి చేతిలో చిత్తయ్యాడు. ఈ మ్యాచ్ సుమారు గంటా 8 నిమిషాల సేపు సాగింది. స్టార్ షట్లర్లు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్, సాత్విక్-చిరాగ్‌శెట్టి జోడీలు తొలిరౌండ్‌లోనే ఓడిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68